RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 197 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 ఆగష్టు 2024 శుక్రవారం పేజీలు : 4

### భారత్‌లోని బంగ్లాదేశీ విద్యార్థుల్లో 'ఆందోళన'

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో వరుస ఆందోళనలతో అట్టుడికిపోతుంది. అలాంటి వేళ.. అక్కడ తమ కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారోనని అలీగడ్ ముస్లిం యూనివర్సిటీ(ఏఎంయూ)లోని బంగ్లాదేశ్‌కు చెందిన పలువురు విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ దేశంలో చోటు చేసుకున్న పరిణామాలపై వారు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి విపత్కర సమయంలో.. తమ తమ కుటుంబా లు సురక్షితంగా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. అయితే ఇండియాలో తామంతా సురక్షితంగానే ఉన్నామని చెప్పారు.

**పాయల్ స్పందిస్తూ...** అలీగడ్ ముస్లిం యూనివర్సిటీలోని పీహెచ్‌డీ విద్యార్థి పాయల్ రాయ్ స్పందించారు. బంగ్లాదేశ్‌లో తమ కుటుంబం గ్రామీణ ప్రాంతంలో నివసిస్తుందన్నారు.



## ప్రతిపక్షాల కోర్కెలు చూసి...
# నవ్వి పోతున్నారు..!
### ఒకళ్ళకి ఉప ఎన్నికలు - మరొకరికి రాష్ట్రపతి పాలన!

హైదరాబాద్ / అమరావతి – రెండు తెలుగు రాష్ట్రాలలో అధికార మార్పిడి జరిగింది.. దూరమైన అధికారానికి దగ్గర కావడానికి ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ – వైసిపి అధికార పార్టీలు అయిన టిడిపి – కాంగ్రెస్ పార్టీలను టార్గెట్ చేస్తూ ముందుకు వెళుతున్నాయి. వాస్తవంగా ప్రతిపక్ష పార్టీలు ప్రజల పక్షాన పోరాటం చేయాలి ... అందులో తప్పులేదు .. కానీ కొత్త ప్రభుత్వాలు ఏర్పడి రెండు నెలలు కూడా కాకముందు నుంచే రాజకీయంగా పసలేని విమర్శలు చేస్తూ వైసీపీ – బీఆర్ఎస్ పార్టీలు ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటున్నాయి. ఎంత కామెడీ అంటే ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండు నెలలు కూడా పూర్తవకుండానే రాష్ట్రంలో ప్రభుత్వమే రద్దుచేసి రాష్ట్రపతి పాలన పెట్టాలి అంటూ దేశ రాజధానిఢిల్లీ దాకా వెళ్లి నిరసన తెలిపి నవ్వుల పాలయ్యారు వైసీపీ అధినేత జగన్ రెడ్డి .

పొరుగు రాష్ట్రంలో తమ మిత్రపక్షం వైసిపిఢిల్లీ దాకా వెళితే మేము ఎందుకు ? వెళ్ళకూడదు అనుకున్నారో ఏమో కానీ బిఆర్ఎస్ నేతలు కేటీఆర్ – హరీష్ రావు కూడా ఢిల్లీ పర్యటన చేపట్టారు. అక్కడ కూడా వారిద్దరూ చాలా కామెడీగా తెలంగాణలో త్వరలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని ప్రకటించి నవ్వుల పాలయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ రోజు రేపు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పోలు పోతుంది. తిరిగి బి ఆర్ ఎస్ అధికారంలోకి వస్తుంది అంటూ మైండ్ గేమ్ మొదలుపెట్టారు. మరి గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు .. ఎమ్మెల్యేలు .. ఎమ్మెల్సీలను తమ పార్టీలో చేర్చుకుని గులాబీ కండువా కప్పినప్పుడు కేటీఆర్ – హరీష్ రావుకు ఈ నీతి సూత్రాలు ఎందుకు గుర్తు రాలేదో వారే చెప్పాలి.

ఏది ఏమైనా వైసీపీ – బీఆర్ఎస్ పార్టీలకు అధికారం పోవడంతో వారు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి.

## రేవంత్ యూఎస్ టూర్ లో భారీ విజయం..భారీ విస్తరణకు కాగ్నిజెంట్ ఓ కే



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టుబడుల్ని ఆకర్షించటమే లక్ష్యంగా అమెరికా.. సౌత్ కొరియా దేశాల్లో పర్యటించేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న విదేశీ ప్రయాణం ఉత్తమ ఫలితాల్ని ఇస్తోంది. ఐటీ సేవల్ని అందించే దిగ్గజ కంపెనీల్లో ఒకటైన కాగ్నిజెంట్ భారీ విస్తరణ ప్లాన్ ను రేవంత్ సమక్షంలో ప్రకటించింది. దాదాపు 15 లక్షల చదరపు అడుగుల్లో 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే కొత్త క్యాంపస్ ను ఏర్పాటు చేసేందుకు ఓకే చెప్పింది. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్.. కంపెనీఇతర ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ సందర్భంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం కాగ్నిజెంట్ విస్తరణ ప్లాన్ పై కొత్త ఒప్పందం జరిగింది. ఈ విజయం పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖాతాలో పడుతుందని చెప్పాలి. ఎందుకుంటే.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఆయన చేసిన తొలి విదేశీ పర్యటన దావోస్ కు వెళ్లటం. ఆ సందర్భంగా ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి. కొత్త ఆవిష్కరణలు.. టెక్నాలజీలను డెవలప్ చేసే సెంటర్ ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్న కాగ్నిజెంట్ అందుకు అనువైన ప్రాంతాల్ని వెతికే క్రమంలో హైదరాబాద్ ను ఎంపిక చేసుకుంది.

తాజాగా చేసుకున్న ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ స్పందిస్తూ.. ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణాన్ని హైదరాబాద్ లో కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగ్నిజెంట్ సంస్థ ఏర్పాటు చేస్తున్న కొత్త సెంటర్ తో ప్రపంచ టెక్నాలజీ సంస్థలన్ని హైదరాబాద్ ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసే కొత్త సెంటర్ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మెరుగైన సేవల్ని అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్.. మెషిన్ లెర్నింగ్.. డిజిటల్ ఇంజనీరింగ్.. క్లౌడ్ సొల్యూషన్స్ సహా వివిధ ఆదునాతన సాంకేతికతలపై కొత్త సెంటర్ ప్రత్యేకంగా ఫోకస్ చేస్తుందని.. హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని టైర్ 2 నగరాల్లోనూ ఐ సేవల్ని విస్తరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మొత్తంగా తన విదేశీ పర్యటనలో కీలకమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవటంలో రేవంత్ సక్సెస్ అయ్యారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



### మేడిగడ్డ, సుంకిశాల ప్రాజెక్టుల పాపం భారాసదే: భట్టి విక్రమార్క

హైదరాబాద్: మేడిగడ్డ ప్రాజెక్టుతోపాటు సుంకిశాల పాపం కూడా భారాసదేనని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. ఆ నెపం వేరొకరి మీద వేయడం దారుణమని విమర్శించారు. నాసికరమైన కట్టడం, డిజైన్ లోపం కారణంగానే 2021లో భారాస హయాంలో చేపట్టిన సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందన్నారు. భారాస కాలం నాటి ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. కూలిపోయే గోడలు కట్టి.. మరొకరిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వర్షాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. పదోన్నతులపై ఉద్యోగులతో చర్చిస్తామని తెలిపారు.

# గృహలక్ష్మి పథకానికి 'ఊపిరి'
### మార్గదర్శకాల రూపకల్పనలో అధికారులు




## త్వరలో సీఎంకు నివేదిక - ఆమోదం లభిస్తే అమలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ సర్కారు చేసిన తప్పులను మళ్లీ తామూ చేయకూడదని రేవంత్రెడ్డి ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. విధానాల రూపకల్పనలో తప్పులు, పొరపాట్లు లేకుండా ముందుకుపోవాలని నిర్ణయించినట్టు సమాచారం. నీళ్ళు, నిధుల విషయంలో అవే వ్యూహాలను అనుసరిస్తున్న రేవంత్ సర్కారు తాజాగా ఇండ్ల విషయంలోనూ అదే బాటలో వెళ్లాలని అనుకుంటున్నది. అందుకే, ప్రతి అడుగూ ఆచితూచి వేయాలనే యోచనలో ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు సొంత గూడు కోసం చేపట్టిన గహలక్ష్మి పథకానికి కొత్త నిబంధనలు రూపొందించడం ద్వారా ఊపిరి పోయాలని భావిస్తున్నది.

పథకాన్ని అమలు చేసేందుకు కలెక్టర్లకే అధికారాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. లబ్ధిదారుల ఎంపికను కలెక్టర్ల స్వేచ్ఛకే వదిలేసి, తప్పొప్పులకు వాళ్లనే బాధ్యులను చేసేదిశగా కొత్త విధాన రూపకల్పనకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ పనిలో పడింది. ఈమేరకు ప్రత్యేకంగా ఒక నూతన విధానాన్ని తయారుచేసి సీఎం రేవంత్తోపాటు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి పంపనున్నారు.

ప్రాంతాల జనాభా ఆధారంగా గహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికను కలెక్టర్లు చేసేలా నిబంధనలు రూపొందించేందుకు కసరత్తు చేపట్టినట్టు తెలిసింది. సాధారణంగా ప్రభుత్వానికి సంబంధించిన ఏ గహ నిర్మాణ పథకంలోనైనా ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం కోటా కల్పించడం సహజమని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అయితే, ఈ పథకంలో మాత్రం కొత్త విధానానికి శ్రీకారం చుట్టాలని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. జనాభా ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేయాలనే నిబంధనలు అమల్లోకి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 80 శాతానికి పైగా గిరిజనులే నివసిస్తారు. అందుచేత, అక్కడ 1/70 చట్టం అమలులో ఉంటుంది. గిరిజనేతరుల చేతుల్లో భూమి ఉండేందుకు ఆస్కారం ఉండదు. ఒక వేళ ఉన్నా... 1960కి పూర్వం ఉన్న వారికే సొంత స్థలం కలిగి ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో అక్కడ గిరిజనేతురులకు వారి జనాభా ఆధారంగా ఇండ్లు ఇవ్వడం కుదరదు. అలాగే హైదరాబాద్లోని పాతబస్తీతో ఇతర ప్రాంతాల్లో అధికంగా ముస్లీంమైనార్టీలు ఉంటారు. ఇక్కడ ముస్లీమేతర పేదలు సొంత స్థలం కల్గి ఉండేందుకు సాధారణంగా అవకాశం ఉండదు. రాష్ట్రంలోని ఇతర పట్టణ ప్రాంతాల్లో దళితులు సొంత స్థలం కల్గి ఉండే పరిస్థితి కూడా చాలా తక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తరహా పరిస్థితులను స్థానిక కలెక్టర్లు సముతుల్యం చేసి లబ్ధిదారులను ఎంపికచేసేలా నిబంధనలు రూపొందించాలని అనుకుంటున్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే ఇండ్లలో జనాభా ప్రాతిపదికన పంపిణీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే, ఎక్కడ ఎంత ఇచ్చామో%ౌ% ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో కలెక్టర్లు, లబ్ధిదారులను ఎంపిక చేసిన అనంతరం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాల్సిన అవసరం ఉంటుందని గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. ఈ 'గహలక్ష్మి' పథకానికి అర్హత సాధించాలంటే వారికి ఎంత స్థలం ఇవ్వాలనే విషయంపై అధికారులు స్పష్టతకు రానట్టు తెలిసింది. గ్రామాల్లో ఎంత స్థలముంటే ఎంపిక చేయాలి ? పట్టణాల్లో ఎంత జాగా కావాలన్న దానిపై ఇతమిద్ధంగా ఒక నిర్ణయానికి రాలేదని సమాచారం. డబుల్ బెడ్ రూం ఇండ్లను 125 గజాల్లో నిర్మించామనీ, దీనికి ఎంత భూమి అవసరమన్న దానిపై ముఖ్యమంత్రి, గహ నిర్మాణ శాఖ మంత్రి, మున్సిపల్, గ్రామీణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులు నిర్ధారిస్తారని తెలిసింది. పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు కనీసం 125 గజాల స్థలం ఉండే అవకాశం ఉంటుందా ? అనే అంశంపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. చివరకు ప్రభుత్వ విధాన నిర్ణయమే కీలకం కానుంది. ఈ విధానానికి సీఎం, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపితే, ఆనక అమలు వేగంగా జరుగుతుందని గృహనిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు.

## పాఠశాల అక్కడ.. అభివృద్ధి పనులు ఇక్కడ

మెట్‌పల్లి : పాఠశాల నిర్వహణ ఒకచోట అయితే అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులు మరోచోట చేపట్టడంతో అవి ఎంత వరకు ఉపయోగపడతాయోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల ప్రాథమిక పాఠశాల స్థానిక మల్లన్న ఆలయం సమీపంలోని సొంత భవనంలో కొనసాగేది. ఏళ్ల కిందట నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడం, ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడం, విష కీటకాల ప్రమాదం పొంచి ఉందన్న కారణంతో సుమారు ఆరేళ్ల కిందట ప్రాథమికోన్నత పాఠశాల భవనంలోకి మార్చారు. యుపీఎస్‌లో నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి బోధన సక్రమంగా అందుతుందని భావించారు. ఆ తర్వాత ప్రాథమిక పాఠశాల భవనంలో కొన్ని రోజులు అంగన్‌వాడీ కేంద్రం కొనసాగింది. అనంతరం గ్రామ పంచాయతీకి నూతన భవనం మంజూరవడంతో పాత భవనాన్ని కూల్చగా, ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇటీవల ప్రాథమిక పాఠశాల పేరిట అమ్మ ఆదర్శ పనులకు రూ.4.75 లక్షలు మంజూరయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీ కొనసాగుతున్న ప్రాథమిక



పాఠశాల భవనం ఆవరణలో మూత్రశాలలు నిర్మించారు. భవనానికి మరమ్మతు చేసి విద్యుత్తు పనులు చేపట్టారు. పంకాలు బిగించి శుద్ధజల ప్లాంటు అమర్చారు. ఆరేళ్ల నుంచి పాఠశాల నిర్వహించకపోవడంతో ఇవేవీ విద్యార్థులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. భవిష్యత్తులో ఎంత వరకు ఉపయోగపడతాయో అధికారులకే తెలియాలి అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయమై ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యుడు రాకేష్ మాట్లాడుతూ తాను ఇక్కడకు రాక ముందు నుంచే పాఠశాల యుపీఎస్ భవనంలో కొనసాగుతుందన్నారు. ఈ ఏడాది అక్కడికి మార్చుదామనుకున్నామని, గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతుండడంతో నూతన భవనం పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని ఎంపీడీవో చెప్పారని పేర్కొన్నారు. పాఠశాల భవనం అదే కావడంతో అమ్మ ఆదర్శ పనులు అక్కడే చేశారని తెలిపారు. కాగా ఇక్కడ పంచాయతీ నూతన భవనం పనులు ఇంకా మొదలవకపోవడం గమనార్హం.

## బుడతల విద్యపై పెద్దల దృష్టి

ఆలేరు : ప్రతి మూడు సంవత్సరాలకోసారి మూడో తరగతిలో విద్యార్థుల సామర్థ్యాలను నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) మదింపు చేస్తున్న జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) ఈసారి ఒకటో తరగతితో బడిలో చేరేనాటికి విద్యార్థుల సామర్థ్యాలను 'స్కూల్ ప్రిపరేషన్ మాడ్యూల్(ఎస్పీఎం)- విద్యా ప్రవేశ్' పేరిట మదింపు చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా.. ఇందులో సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. ఆవాసాల ప్రమాణంగా జిల్లాను యూనిట్‌గా తీసుకుని రెండు నుంచి మూడు ప్రాథమిక పాఠశాలలను గుర్తించి ఎన్సీఈఆర్టీకి చెందిన ఆచార్యులు నేరుగా విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేస్తారు. ఈ కార్యక్రమం జరగనుంది.

**ఒకటో తరగతిలో ఉండే సామర్థ్యాలు...**




పాఠశాలకు నిత్యం రావడమే విద్యార్థి మొదటి సామర్థ్యం. పాఠశాల ప్రారంభ గంట నుంచి ఇంటిగంట కొట్టే వరకు ఎన్సీఈఆర్టీ ప్రతినిధి పాఠశాలలోనే మకాం చేసి విషయాలను గమనించి నమోదు చేస్తుంటా రు. ఎన్సీఈఆర్టీ ప్రతినిధులకు సహాయకులుగా జిల్లాకు చెందిన ఇద్దరు లేదా ముగ్గురు సీనియర్ ఉపాధ్యాయులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు(ఎఫ్ఐ)గా ఉంటారు. వీరిని జిల్లా విద్యాశాఖ ఎంపిక చేస్తుంది. యాదాద్రి జిల్లాకు సంబంధించి ఎంపీపీఎస్ వలిగొండకు చెందిన ఎ.శ్రీనివాస్, ఎంపీయూపీఎస్ ప్రొద్దుటూరుకు చెందిన వై.వెంకటనర్సింహారెడ్డి ఎఫ్ఐలుగా నియమితులయ్యారు.

**పరిశీలనలు ఇలా...** పాఠశాల ప్రారంభ సమయానికి ముందే ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, తరగతి గది నిర్వహణ, పాఠశాల ఆవరణ స్వచ్ఛత, తరగతి గది బోధనలో ఉపాధ్యాయులు ప్రదర్శిస్తున్న టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పాఠం చెప్పే తీరు, విద్యార్థుల అల్లరిని అరికడుతున్న విధానం, మధ్యాహ్న భోజనం వంట వద్దన పరిశుభ్రత, భోజనం చేసే తీరు తదితరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసే ఎన్సీఈఆర్టీ ప్రతినిధి సీల్డ్ కవర్‌లో వీటిని కేంద్రానికి పంపిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో బోధన, తదితర విషయాలపై వారి అభిప్రాయా లను కూడా సేకరిస్తారు. **ఉమ్మడి జిల్లాలో గుర్తించిన పాఠశాలలు..**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎంపీపీఎస్ వేములకొండ, సంగెం పాఠశాలలు, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కెకె రోడ్ సూర్యాపేట, ఎంపిపిఎస్ కాసరాబాద్, ఎంపీపీఎస్ టేకుమట్ల పాఠశాలలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలోని రెండు పాఠశాలల్లోని మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు.

## స్థలాల క్రమబద్ధీకరణతో కదలిక

మెదక్ :అక్రమ లేఅవుటు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వీటిని మూడు నెలల్లో పరిష్కరిస్తామని తాజాగా ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందుకు సంబంధించి విధివిధానాలను జారీ చేసింది. దీంతో జిల్లాలో వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

గత ప్రభుత్వ హయాంలో పురపాలిక, గ్రామపంచాయతీల పరిధిలో 2020 ఆగస్టు 26 ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. నాటి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వీటికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు. జిల్లాలో నాలుగు పురపాలికలు ఉండగా, 14,507 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దానికి రూ.1,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ప్రభుత్వానికి వీటిరూపంలోనే రూ.1.45 కోట్ల ఆదాయం సమకూరింది.

# మిగిలింది అటవీ అనుమతులే



సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టుకు నీరందించాలన్న ఉద్దేశంతో రోళ్లవాగు ప్రాజెక్టు అధునికీకరణ పనులు 2017లో ప్రారంభించారు. అటవీ అధికారుల అభ్యంతరంతో నీటి నిలువ సామర్థ్యం లేక చివరి గ్రామాలకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. 0.25 టీఎంసీ సామర్థ్యం నుంచి టీఎంసీ నిలువ చేసేందుకు రూ.60 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టగా ప్రస్తుతం రూ.153 కోట్లకు చేరుకొంది. అటవీ అనుమతులు రాకపోవడంతో ప్రాజెక్టు మూడు తూములకు షట్టర్లు బిగించకపోవడంతో గతేడాది నుంచి వచ్చిన వరద వచ్చినట్లు వెళ్లిపోతుంది. తాత్కాలికంగా షట్టర్ అడ్డుగా వేసినప్పటికీ మత్తడి నిర్మాణం పక్కన వరద నీరు వృథాగా పోతుంది.

**శాఖల మధ్య సమన్వయ లోపం**

శాఖల మధ్య సమన్వయం కొరవడడం పనుల జాప్యానికి కారణమవుతోంది. ముంపు వివరాలు అందించామని ఇరిగేషన్ అధికారులు చెబుతుండగా ఎలాంటి వివరాలు అందలేదంటూ అటవీ అధికారులు పేర్కొంటున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న 864 ఎకరాల అటవీ భూమికి బదులుగా ఇతర ప్రాంతాల్లో రెవెన్యూ భూములను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు భూములు అప్పగించడంలో జాప్యం చేయడంతో అటవీ అధికారులు తరచూ పనులను అడ్డుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని పెగడపల్లి, నంచర్ల, ల్యాగలమర్రి తదితర ప్రాంతాల్లో రెవెన్యూ భూములు పరిశీలించినప్పటికీ స్థానికుల అభ్యంతరంతో అలాగే ఉండిపోయింది. రెవెన్యూ శాఖ భూముల అప్పగించడం త్వరితగతిన పూర్తి చేసినప్పుడే ప్రాజెక్టులో టీఎంసీ సామర్థ్యం నిలువ చేసే అవకాశముంటుంది. ఇప్పటికైనా రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రాజెక్టు అధునికీకరణ పనులు పూర్తి కానున్నాయి.

**మంత్రుల దృష్టికి తీసుకెళ్లా..**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమస్యలతోపాటు ఇతర సమస్యలపై సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లా. త్వరలోనే విప్ లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తా.సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

**తాత్కాలికంగా షట్టర్లు బిగించాం**

అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో ప్రాజెక్టుకు ఉన్న మూడు తూములకు షట్టర్లు బిగించాల్సి ఉంది. ప్రస్తుతం తాత్కాలికంగా తూములకు షట్టర్లు బిగించి నీటి నిలువ చేస్తూ రైతుల అవసరాల మేరకు సరఫరా చేస్తున్నాం. అటవీ శాఖ అనుమతి రాకపోవడంతో గతంలో 0.25 సామర్థ్యం మేరకు నీటిని నిలువ చేసుకునేలా చూస్తున్నాం. అటవీ శాఖ అనుమతి రాగానే టీఎంసీ నిలువ చేసేలా చర్యలు తీసుకుంటాం.చక్రునాయక్, ప్రాజెక్టు డీఈఈ

# విజృంభిస్తున్న డెంగీ అప్రమత్తతే చికిత్స



కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి జ్వర బాధితులు బారులుదీరుతున్నారు. ఆసుపత్రిలో ఓపీ గరిష్ఠంగా 500 కాగా గత నెల నుంచి 800కి పైగా భారీగా నమోదవుతుంది. ఇందులో చాలామంది ఓపీలో డాక్టర్ రాసిన మందులు తీసుకెళున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే ఆసుపత్రిలో అడ్మిట్ అవుతున్నారు. అధికంగా దగ్గు, జలుబు, జ్వరంతోపాటు కీళ్ల నొప్పులతో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ ఆసుపత్రిలో 50 వరకు డెంగీ కేసులు నమోదు కాగా, ఎవరికీ ప్రాణపాయంలేదని జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ఆసుపత్రిలో రోగులు ఓపీ, రక్తపరీక్షలు, మందులు తీసుకునే చోట తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అదనపు సిబ్బందిని నియమించి రద్దీని తగ్గించాలని రోగులు కోరుతున్నారు.

**దోమల నివారణ చర్యలు శూన్యం..**

జిల్లా ఆసుపత్రిలో వర్షాకాలం నుంచి ఇప్పటివరకు జూన్‌లో 4, జులైలో 28 డెంగీ కేసులు నమోదు కాగా ఈనెల 5 రోజుల్లోనే 18 కేసులు నమోదయ్యాయి. దోమలతోనే డెంగీ విజృంభిస్తున్నా వాటి నివారణ చర్యలపై అధికారులు దృష్టి సారించడంలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో, నగరాల్లో ఫాగింగ్ యంత్రాలను తిప్పడంతోపాటు ఆయిల్ బాల్స్ లాంటివి వాడి దోమలను అరికడితే డెంగీ తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

**అసలే కీళ్లనొప్పులు గంటల తరబడి నిలబడి**

రోగాల బారినపడి పూర్తిగా ఇబ్బందిపడినప్పుడు మాత్రమే చాలామంది దవాఖానాకు వస్తుంటారు. కొందరికి సహాయకులు వస్తుంటే, మరికొందరు ఒంటరిగానే వస్తుంటారు. ఇలాంటి వారు ఓపీ వద్ద పేరు రాయించుకోవడానికి చాలా సమయం నిల్చోవల్సి వస్తోంది. అసలే రోగాలతో వస్తున్న వీరికి ఇక్కడికి వచ్చిన తర్వాత మరో రోగం దాపురించేలా ఉంది. ఆన్‌లైన్‌లో అన్నీ వివరాలు నమోదుకు ఒక్కో రోగికి కనీసం రెండు నుంచి మూడు నిమిషాల సమయం పడుతుండడంతో లైనులో ఉన్న రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కూర్చోవడానికి కుర్చీలు లేక గంటల తరబడి లైనులో నిల్చోని అవస్థలు పడుతున్నారు. ఓపీ వద్ద సరైన లైటింగ్ ఫ్యాన్లు కూడా లేవు. రక్త పరీక్షలు, డాక్టర్ వద్ద, మందుల వద్ద విపరీతంగా లైను ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూర్చునే ఏర్పాట్లు చేసి ఓపీ అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

**జాగ్రత్తలు పాటించాలి**

డెంగీతో భయపడాల్సిన అవసరంలేదు. ఇప్పటి వరకు నమోదైన కేసులలో ఎవరికీ ప్రాణపాయం లేదు. దోమలు ఇంటి పరిసరాలలో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికంగా నీళ్లు, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లతోపాటు తగినన్ని పండ్లు తీసుకోవాలి. కివీ ఫ్రూట్, బొప్పాయి ఆకులు తినడంతో డెంగీ తగ్గుతుందని అపోహ మాత్రమే. ఏదైనా అవసరమున్నంతే తినాలి. అధికంగా తీసుకుంటే వాంతి అవుతుంది. పూల కుండీలతోపాటు నీళ్లు నిల్వ లేకుండా చూడాలి. ఇంట్లోకి దోమలు రాకుండా మెస్ డోర్‌లు, తెరలు ఏర్పాటు చేసుకోవాలి.డాక్టర్ నవీన, జనరల్ ఫిజీషియన్

# పంటల భీమా ఆశలు ఆవిరి!



సిరిసిల్ల: విత్తనం విత్తిన నాటి నుంచి చేతికొచ్చిన పంటలు విక్రయించే వరకు రైతులకు అండగా ఉండేది బీమా పథకం. వానాకాలం సాగు చేసే పంటలకు జూన్ నుంచి సెప్టెంబరు వరకు బీమా పథకం వర్తిస్తుంది. ఈ సీజన్‌లో వరికి మాత్రమే ఈ నెల 15 వరకు నమోదుకు అవకాశం ఉంది. మిగతా పంటలన్నింటికి గడువు పూర్తయింది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం, మిగిలిన 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించి అమలు చేశారు. కొన్ని సమస్యలు ఎదురవడంతో ఉపయోగం లేదని ఈ పథకాన్ని గత ప్రభుత్వం నాలుగేళ్ల కిందట నిలిపివేసింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. బీమా ప్రీమియం పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందని భరోసా కల్పించింది. ఇటీవల బడ్జెట్ సమావేశంలోనూ ఈ ప్రస్తావన వచ్చింది. ఉమ్మడి జిల్లాలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 11.47 లక్షల ఎకరాలు. ఇప్పటికి సాగు చేసింది మాత్రం 6.04 లక్షల ఎకరాలు. లోటు వర్షపాతం.. జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు లేక సాగు తగ్గింది. ఈ వాతావరణ పరిస్థితులు ఇలానే కొనసాగడం కానీ.. పంట చేతికందే సమయంలో భారీ వర్షాలు పడితే నష్టం చేకూరుతుంది. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకునేది పంటల బీమా మాత్రమే.

**ఆన్‌లైన్‌లో సాగు వివరాలు..**


ఉమ్మడి జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 5.67 లక్షల మంది రైతులున్నారు. వానాకాలం ప్రధాన పంటలుగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. మిగతా పంటలు నామమాత్రంగానే సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అన్ని పంటలు కలిపి 6.04 లక్షల ఎకరాలు కాగా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 3.44 లక్షల ఎకరాల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతు సంక్షేమ పథకాల అమలుకు ఈ వివరాలే ప్రామాణికం. కానీ బీమా అమలులో పంట విత్తుకునే సమయంలోనే ప్రీమియం చెల్లించాలి. పంట నష్టం జరిగినపుడు ఒక్కో పంటకు ఒక విధానం ఉంటుంది. గ్రామం, మండల యూనిట్‌గా తీసుకుంటారు. పరిహారం చెల్లింపులోనూ పంటల సాగును.. దెబ్బతిన్న విస్తీర్ణాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ సీజన్‌లో ప్రధాన పంటలు పత్తి, మొక్కజొన్న, వరి పంటల సాగు గడువు ముగిసింది. ఇప్పటికీ తుది మార్గదర్శకాలతోపాటు బీమా కంపెనీతో ఒప్పందం, ప్రీమియం నిర్ధారణతో విధివిధానాలపై ఉత్తర్వులు వెలువడలేదు. ఈ విషయమై రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్‌ను సంప్రదించగా ప్రభుత్వం నుంచి తమకింకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదన్నారు.

**2023లో నేరుగా పరిహారం**

ప్రకృతి ప్రకోపంతో పంట నష్టం వాటిల్లినపుడు బీమా ఆదుకునేది. 2020 వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అప్పుడు ప్రభుత్వాన్ని హైకోర్టు రైతులకు పంటల బీమా, పెట్టుబడి రాయితీ ఇవ్వాలని ఆదేశించింది. కానీ అప్పటికే సీజన్ ముగియడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. 2021 యాసంగి, 2022 వానాకాలంలోనూ వేల ఎకరాల్లో వరి, పత్తి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినా ప్రాథమిక అంచనాలకే పరిమితమయ్యారు. 2023 మార్చిలో వడగళ్ల వానకు పంట నష్టపోగా మొదటి విడత రూ.85 లక్షల పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ పరిహారం అందరికీ రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

## చిట్టి చేతులు.. వెట్టి చాకిరి

కరీంనగర్ : పాఠశాలలకు వెళ్లాల్సిన పిల్లలు కారా?నాల బాట పడుతున్నారు. బాధ్యతలూ మీదేసుకుంటున్నారు. చిన్నారులను కుటుంబ పరిస్థితులు... ఆర్థిక ఇబ్బందులు పనుల వైపు మళ్లిస్తున్నాయి. బాలల భవిష్యత్తు మసకబారకుండా ప్రభుత్వం ఏటా జులైలో ఆపరేషన్ ముస్కాన్.. జనవరిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా చర్యలు చేపడుతోంది. తప్పిపోయిన, బాల కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగిస్తున్నారు. చిన్నపిల్లలతో పనులు చేయిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ జులైలో పోలీసు, కార్మిక శాఖ, ఐసీడీఎస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజులపాటు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించారు. నెల



రోజుల్లోనే 132 మందిని ఉమ్మడి జిల్లాలో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలలతో పనులు చేయిస్తున్న యజమానులపై 21 కేసులు నమోదు చేశారు.

**టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం** చిన్నారులు ఎవరైనా పనులు చేస్తున్నట్లు కనిపిస్తే వారిని సంరక్షించేం దుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. 1098, 100 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇచ్చి ప్రతి ఒక్కరూ సహకరించాలని బాలల సంరక్షణ విభాగం కోరుతోంది. చిన్నారులు ఎక్కడైనా పనిచేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలి. అధికారులు అక్కడికి చేరుకొని విచారణ అనంతరం చిన్నారులను సంరక్షణ కేంద్రానికి తరలిస్తారు. లేదంటే వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు.

## ఆగుతూ.. సాగుతూ

ఖమ్మం : ఖమ్మం గ్రామీణ మండలంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతూ ఉన్నాయి. శంకుస్థాపన చేసి 11 నెలలైనా నిర్మాణ పనులు పిల్లర్ల దశకే పరిమితమయ్యాయి. ప్రారంభంలో వేగంగా సాగినా ఆ తర్వాత చతికిలపడ్డాయి. దాదాపు ఆరు నెలల తర్వాతమళ్లీ పనులు ప్రారంభమయ్యాయి.ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ఖమ్మం గ్రామీణ మండలంలోని మద్దులపల్లిలో అధికారులు అయిదెకరాల భూమిని కేటాయించారు. గతేడాది సెప్టెంబరులో నాటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 కోట్లతో కళాశాల అకడమిక్, వసతిగృహ భవనాల నిర్మాణం చేపట్టారు. శంకుస్థాపన చేసిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదిదశ నుంచి పిల్లర్ల వరకు వేగంగా జరిగాయి. ఈ నేపథ్యంలో దాదాపు ఆరు నెలల క్రితం పనులు నిలిచిపోయాయి. నిధుల కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయనే ఆరోపణలు వినిపించాయి. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన చొరవతో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. మళ్లీ ఆగకుండా కొనసాగితే వచ్చే ఏడాది నాటికి నూతన భవనం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

అద్దె భవనంలోనే..పాలేరు నియోజకవర్గానికి మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రస్తుతం పెద్దతండాలోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత ఏడాది కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించారు. ఒక్కో ఏడాది 60 మందికి అడ్మిషన్లు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు అద్దెభవనాల్లో తరగతులు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతుల నిర్వహణ, వసతి సౌకర్యం అన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగనున్నాయి.'ప్రస్తుతం భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తిచేసి కళాశాలకు అప్పగిస్తాం.'ఉమామహేశ్వరరావు, ఈఈ

## గనిలో కొలువుల సందడి..

కొత్తగూడెం : సింగరేణిలోని ఏడు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు విడుదల చేసిన రెండో నోటిఫికేషన్‌కు సంబంధించి మంగళ, బుధవారాల్లో రాత పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యా. సింగరేణి వెబ్సైట్ నుంచి అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకొనేందుకు వీలుగా అందుబాటులో ఉంచారు. 09 అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ, 100 జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ, 98 ఎలక్ట్రీషియన్ ట్రైనీ, 47 ఫిట్టర్ ట్రైనీ పోస్టులకు ఈ నెల 6వ తేదీన, 42 మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఈ,ఎం), 07 మేనేజ్‌మెంట్ ట్రైనీ (సిస్టమ్స్), 09 అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ (మెకానికల్) పోస్టులకు 7న కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నారు.ఉదయం నుంచి సాయంత్రం దాకా..

రెండు రోజులపాటు నిర్వహించనున్న పరీక్షలు వివిధ సమయాల్లో జరగనున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 దాకా, 12.30 – మధ్యాహ్నం 2గంటల దాకా, సాయంత్రం 4.30– 6గంటల దాకా పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో అభ్యర్థి రెండు పరీక్షలను రాసేందుకు వీలుగా ఈ సమయాలను కేటాయించారు.

పాటించాల్సిన నిబంధనలుపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పాస్‌పోర్టు ఫోటోను అడ్మిట్ కార్డుపై అతికించి స్వీయ ధ్రువీకరణగా ఫోటోపై సంతకం చేసి తీసుకొని రావాలి.ఓటరు గుర్తింపు/ డ్రైవింగ్ లైసెన్సు/ పాన్‌కార్డు/ ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి పరీక్ష కేంద్రానికి తెచ్చుకోవాలి.అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫోటోలు, బాల్‌పాయింట్ పెన్ను తప్పనిసరి.పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు కేంద్రంలో రిపోర్టు చేయాలి.పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు పరీక్ష కేంద్రం ప్రవేశ ద్వారాలు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించరు.

# ఆగస్టుపైనే ఆశలు

హైదరాబాద్: వానాకాలం మొదలై రెండు నెలలవుతోంది. సరైన వర్షాలు లేక నగరంలో భూగర్భ జల మట్టాలు పెద్దగా పెరగలేదు. వేసవిలో ఎండిన బోర్లు ఇప్పటికీ ఇంకా రీఛార్జ్ కాలేదని ఇళ్ల యజమానులు వాపోతున్నారు. జూన్, జులైలో తగిన వర్షపాతం లేకనే ఈ పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వర్షం కోసం అన్నదాతలు ప్రార్థిస్తుండగా.. బోర్ల రీఛార్జ్ కోసం నగరవాసులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లోని గృహ యజమానులు నీటి కోసం బోర్లపైనే ఆధారపడుతున్నారు. ఈ ఖర్చు భారంగా మారిందని వాపోతున్నారు. వర్షపు నీరు ఇంకేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హైదరాబాద్ జిల్లాలోనూ.. జూన్ ఒకటి నుంచి జులై 31 వరకు నగరంలో 283.1 మిల్లీమీటర్ల వాన కురియాల్సి ఉండగా.. 256.5 మి.మీ. మాత్రమే పడింది. 9 శాతం తక్కువ. తిరుమలగిరిలో 202.4, అమీర్‌పేటలో 237.5 మి.మీ., వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు కంటే ఇది తక్కువ.

రంగారెడ్డిలో.. జులై 31నాటికి రంగారెడ్డి జిల్లాలో 246.9 మి.మీ. వర్షపాతం కురియాల్సి ఉండగా 201.0 మి.మీ. మాత్రమే కురిసింది. ఇది 19 శాతం తక్కువ.

సంగారెడ్డిలో.. నగరంలో సగం ప్రాంతం ఉన్న సంగారెడ్డి జిల్లాలోనూ లోటు వర్షపాతమే. జూన్, జులై నెలల్లో 341 మి.మీ. కురియాల్సిఉండగా.. 256.3 మి.మీ. మాత్రమే నమోదైంది. 25 శాతం తక్కువగా



వానలు పడ్డాయి. మేడ్చల్‌లో నయం నగరంలోని మేడ్చల్ జిల్లాలో మాత్రం 232.0 మి.మీ. గాను 251.5 మి.మీ. వర్షం పడింది. 8 శాతం ఎక్కువ వానలు పడ్డాయి. ఇక్కడి సగటు వర్షపాతమే తక్కువ కాబట్టి ఆ మేరకు అధికంగా కనిపిస్తోంది.

భూగర్భ జలమట్టాలు

నగరంలో జూన్‌లో పెద్దగా భూగర్భ జల మట్టాలు పెరగలేదు. 250 ప్రాంతాల్లో భూగర్భ జల శాఖ ఏర్పాటుచేసిన ఫిజోమీటరు నుంచి సేకరించిన జిల్లా సగటు ప్రకారం.. మే నెలలో హైదరాబాద్ జిల్లాలో 9.42 మీటర్ల లోతుకు జలాలు పడిపోతే.. జూన్‌లో 8.56 మీటర్లకు మాత్రమే పెరిగింది. గత సీజన్‌లో వర్షాకాలం ముగింపు.. నవంబరులో నీటి మట్టాలు 4.94 మీటర్లపైకి వచ్చాయి.

రంగారెడ్డిలో మే నెలలో 14.06 మీ. లోతులో ఉంటే.. జూన్‌లో 13.99 మీ.కి మాత్రమే పెరిగాయి.

మేడ్చల్ జిల్లాలో 13.99 నుంచి 12.89 మీ.కు అంటే స్వల్పంగా మాత్రమే జూన్‌లో పెరిగింది.

జులైలో విస్తారంగా వర్షాలు లేవు. మట్టాల్లో మార్పులు లేదు.

## పడకలు దొరక్క.. వైద్యం అందక

హైదరాబాద్ : వానాకాలం...వాతావరణ మార్పులతో ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులైన ఉస్మానియా, గాంధీల్లో రోగుల రద్దీ భారీగా పెరిగింది. ఈ రెండు ఆసుపత్రులకు నిత్యం 4-5 వేల మంది రోగులు వస్తున్నారు. ఉస్మానియాలో స్థలాభావంతో ఓపీతోపాటు అత్యవసర విభాగంలో పడకలు దొరకడం లేదు. కొన్ని విభాగాల వార్డుల్లో నేలపై పరుపులు వేసి చికిత్సలు అందిస్తున్నారు. కొన్ని ఆక్సిజన్ ఫ్లో మీటర్లు పనిచేయడం లేదు. వర్షం పడిన సందర్భంలో పైకప్పు నుంచి నీళ్లు కారి రోగుల పడకలు తడిసిపోతున్నాయి. ఇటీవలి ఉస్మానియా, గాంధీలో జరిగిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీలతో ఆ ప్రభావం సేవలపై కనిపిస్తోంది. ఈ రెండు ఆసుపత్రుల నుంచి దాదాపు 60-70 మంది బదిలీలపై వివిధ జిల్లాలకు వెళ్లిపోయారు. అక్కడ నుంచి అదే స్థాయిలో విధుల్లో ఇంతవరకు చేరలేదు. అక్కడకు వెళ్లారు.. ఇక్కడకు రావడం లేదు.. ఉస్మానియాలో 19 ఆర్ఎంవో, సీఎంవో పోస్టుల ఖాళీలు ఉండగా...ప్రస్తుతం 9 మంది పనిచేస్తున్నారు. కొందరు డబుల్ డ్యూటీలు చేస్తున్నారు. వైద్యుల కొరతతో...సీనియర్ రెసిడెంట్లతో నెట్టుకొస్తున్నారు. గాంధీలో పలు విభాగాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. రెండు చోట్ల పరిపాలనను పర్యవేక్షించే కీలకమైన మెడికల్ సూపరింటెండెంట్లు, ప్రొఫెసర్లు, అసోసియేట్లను ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. అక్కడకు వెళ్లి రిపోర్టు చేశారు. ఇతర జిల్లాల నుంచి ప్రొఫెసర్లు వచ్చి ఇక్కడ చేరడం లేదు. కిందిస్థాయి సిబ్బందిదీ అదే పరిస్థితి. రెండు చోట్ల సుమారు 150 మంది స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్లను బదిలీ చేశారు.

సరిగా మందులు ఇవ్వకపోవడంతో.. కొన్ని రోజులుగా ఈ రెండు ఆసుపత్రులకు పెద్దఎత్తున రోగుల తాకిడి ఉంటోంది. అవసరమైన మందులు సరఫరా కావడం లేదు. కౌంటర్లలో లభించని మందులను దవాఖానాల ప్రాంగణంలో ఉన్న దుకాణంలో కొంటున్నామని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రధాన ఆసుపత్రుల సేవలపై దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

## సీఎన్జీ నో స్టాక్

హైదరాబాద్: పర్యావరణహిత సీఎన్జీ వాహనాల కొనుగోలుకు ఆసక్తి ఉన్నా.. బంకుల ముందు తరచూ నో స్టాక్ బోర్డులు ఉండటంతో కొనుగోలుదారులను అయోమయంలో పడేస్తోంది. ప్రతిరోజూ 2000 కిలోల వరకు స్టాక్ రావాల్సిఉండగా కేవలం 200 కిలోలు వస్తోందని కొందరు డీలర్లు చెబుతున్నారు. నగరంలోని సీఎన్జీ వాహనాలకు అనుగుణంగా 100కి పైగా బంకులుండాలి. నగరంలో 55 మాత్రమే ఉన్నాయి. ఇందులో కంపెనీ అవుట్‌లెట్లయిన కోకో బంకుల్లో సరిపడా స్టాక్ ఉంచేందుకు రెండు నుంచి మూడు వాహనాలు అందుబాటులో ఉంచుతున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు. తార్నాక, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని కోకో స్టేషన్లలో స్టాక్ సరిపడా ఉండటంతో అక్కడ వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇక్కడా గంట సేపు ఆగితే తప్ప దొరికే పరిస్థితి లేదు.

**రోజూ లక్ష కిలోలు అవసరం**నగరంలోని సీఎన్జీ బంకుల్లో రోజూ లక్ష కేజీల సీఎన్జీ అవసరం. ఒక్కో బంకులో 1500 నుంచి 2వేల కేజీలు కావాలి రోజూ కేవలం 200కిలోల గ్యాస్ సరఫరా అవుతోంది. డెలివరీ చేసే ట్రక్‌లో సామర్థ్యం 200 కేజీలు. దీంతో మళ్లీ మరుసటి రోజే స్టాక్ వస్తోంది. దీంతో స్టాక్ వచ్చిన గంటన్నర వ్యవధిలోనే నో స్టాక్ బోర్డులు పెట్టక తప్పడం లేదు. ఓయూ క్యాంపస్ సమీపంలోని హెచ్‌పీ బంకును గమనిస్తే.. ఉదయం నుంచి రాత్రి వరకు ఆటోలు, కార్లు బంకులో, రోడ్డుపై వరుసలో ఉంటున్నాయి.

**ఆ బస్సులకు దూరం..**కంటోన్మెంట్ డిపోలో 130 సీఎన్జీ బస్సులు ఉండేవి. ఇంధనం సరైన సమయానికి చేరకపోవడం, వాటికి సంబంధించి పిస్టన్ సమస్యలు తరచూ ఉత్పన్నమవడంతో ఆర్టీసీ ఆ బస్సుల వినియోగాన్ని పూర్తిగా నిలిపేసింది.

# ఇసుక తరలింపు.. ఇక పారదర్శకం



తాండూరు: జిల్లాలో కాగ్నా, కాకరవేణి నదులతోపాటు, చిన్నపాటి వాగులు, కాలువల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు సాగుతోంది. అధికారులకు తెలిసినా మామూళ్లు, రాజకీయ ఒత్తిళ్లు తదితర కారణాలతో కార్యక్రమానికి అడ్డులేకుండా పోతోంది. ఇకమీదట అలా కుదరదు. ఎందుకంటే.. ఇసుక అక్రమ రవాణా అరికట్టి.. పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసింది. దీని ప్రకారం గతంలో మాదిరి ఇసుక అనుమతులు తహసీల్దార్లు ఇచ్చినా.. పూర్తి పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులు చూస్తారు. నదిలో ఇసుక తోడుతున్నప్పటి నుంచి గమ్యస్థానానికి చేర్చి వచ్చే వరకు ట్రాక్టర్‌పై నిఘా ఉంటుంది. ప్రభుత్వ పనులు, ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక తరలింపునకు మార్పులు చేసిన ఇసుక పాలసీ విధివిధానాలకు సంబంధించి తహసీల్దార్లు, ఎంపీడీఓలకు ఉత్తర్వులు అందాయి.

**ట్రాక్టర్‌కు రూ.25వేలు ముందస్తు జమ**

ప్రస్తుతం ఇసుక తరలించే ఒక్కో ట్రాక్టర్‌కు రూ.25,000ల నుంచి రూ.50,000 వరకు ముందస్తు జమ (సెక్యూరిటీ డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుంది. ఎన్ని ట్రాక్టర్లు కేటాయించుకుంటే అన్ని డీడీలు ఇవ్వాలి. తరలింపు పూర్తయ్యాక రూ.25,000ల డీడీని తిరిగి ఇచ్చేస్తారు. ఒకవేళ నిబంధనలు పాటించకుండా ఇసుక అక్రమంగా పక్కదారి పట్టిస్తే విచారణ జరిపి ఇందులో కోత విధిస్తారు.

**వే బిల్లు.. రూట్ మ్యాప్ తప్పనిసరి**

ఇసుక తరలింపులో గతంలో వే బిల్లులు ఇచ్చేవారు కాదు. కేవలం తహసీల్దార్ ఇసుక తరలింపు పత్రంతో ఎన్ని ట్రిప్పులైనా తీసుకెళ్లేవారు. ప్రస్తుతం అనుమతి పత్రంతోపాటు పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో ట్రిప్పునకు ఒక వే బిల్లు జారీ చేస్తారు. దీన్లో సూచించిన ప్రకారమే వెళ్లాల్సి ఉంటుంది.

**ఆదేశాలు అందాయి : వెంకటేష్, తహసీల్దార్, బషీరాబాద్**

కొత్త ఇసుక పాలసీకి సంబంధించిన తాజా ఉత్తర్వులు అందాయి. గనులశాఖ, పంచాయతీరాజ్, పోలీసు, సాగునీటి శాఖల అధికారుల సమావేశం నిర్వహించి అమలుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఉంటే సంబంధిత శాఖ అధికారి నుంచి సిఫార్సు పత్రం తేవాల్సి ఉంటుంది. తాజా ఉత్తర్వుల ప్రకారమే ఇక ఇసుక అనుమతులుంటాయి.

**96,386 క్యూబిక్ మీటర్లు.. ఏడు ఇసుక రీచ్‌లు..**

జిల్లా అధికార యంత్రాంగం 7 ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో 96,386 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలకు అనుమతులు ఇవ్వొచ్చని తేల్చారు. బషీరాబాద్ మండలం నవాంద్గీ, గంగ్వార్, తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి, ఖాంజాపూర్, పెద్దేముల్ మండలం రేగొండి, కొండాపూర్, పాత తాండూరును ఎంపిక చేశారు. కాగ్నానది పరివాహకంగా తాండూరు నియోజకవర్గ ప్రాంతం ఉన్నప్పటికీ దట్టమైన ఇసుక మేటలు కలిగి ఉండి తరలింపునకు వాహన ఇబ్బంది, పర్యవేక్షణ సవ్యంగా ఉండేలా ఈ ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇసుక అనుమతి కోసం జిల్లా కలెక్టర్ పేరిట రూ.600 డీడీ తీయాల్సి ఉంటుంది. ఇసుక రీచ్‌లు ఉన్న గ్రామాల్లోని పేదలు ఇళ్ల నిర్మాణం చేపడితే వారికి పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరిస్తే డీడీ చెల్లించకుండానే ఉచితంగా ఇసుక అనుమతులు ఇస్తారు.

# అద్దెగూళ్లు... అక్రమాల లోగిళ్లు



హైదరాబాద్: "ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే పదుల సంఖ్యలో యువకులు చేరుతుంటారు. పగలు.. రాత్రి తేడా లేకుండా ఆడపిల్లలను వేధిస్తుంటారు. ఎవరైనా పెద్దవాళ్లు ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తే కొట్టేందుకు వెనుకాడరు. గంజాయి మత్తులో ఊగుతున్న ఆకతాయిలను ఏమీ అనలేకపోతున్నా'మంటూ స్థానిక హోటల్ వ్యాపారి ఆవేదన వెలిబుచ్చారు.

"మధురానగర్‌లో చాలా హాస్టళ్లున్నాయి. చీకటిపడితే చాలు. అమ్మాయిలు, అబ్బాయిలు రోడ్లమీదకు వస్తారు. అర్ధరాత్రి దాటేంత వరకూ కొన్నిసార్లు వాళ్లలో వారే పోట్లాడుకొంటారు. కొద్దిరోజుల క్రితం ఒక అమ్మాయిని ఇద్దరు కుర్రాళ్లు కలసి బాగా కొట్టారు. రోడ్లమీదనే మద్యం తాగుతూ ఊగిపోతారు..' 6 నెలల్లో ఒక్కసారి కూడా ఇటువైపు పోలీసు వాహనం రాలేదంటూ ప్రైవేటు హాస్టల్‌లోని వంటమనిషి పేర్కొంది. ఎస్సార్‌నగర్‌లోని ప్రైవేటు వసతి గృహంలో ముగ్గురు విద్యార్థులు సింథటిక్ డ్రగ్స్ విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు దొరికిపోయారు. డ్రగ్స్ ముఠాలతో పరిచయాలు పెంచుకొని దందా చేస్తున్నట్టు దర్యాప్తులో గుర్తించారు. పలు ప్రైవేటు వసతి గృహాలు మత్తుముఠాలకే అడ్డాలుగా మారడంతో పోలీసులకు 50కు పైగా ఫిర్యాదులు అందాయి.

అడిగేదెవరూ..: అమీర్‌పేట్.. పరిచయం అక్కర్లేని చిరునామా. ఇక్కడ శిక్షణ పొందితే అమెరికా.. యూకే.. కెనడా.. ఇలా ఏ దేశానికైనా దర్జాగా ఎగిరెళ్లొచ్చు అనేంత భరోసా. ఇక్కడ 200లకు పైగా ఉన్న ఐటీ శిక్షణ కేంద్రాలు కిటకిటలాడుతుంటాయి.

ఎస్సార్‌నగర్, మధురానగర్, అమీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో విద్యాసంస్థలున్నాయి. వేలాది మంది పిల్లలు ఇక్కడికి వస్తుంటారు. ఈ పరిసర ప్రాంతాల్లో సుమారుగా 1000కి పైగా ప్రైవేటు హాస్టల్స్ ఉన్నాయి.

వీటిలో 100కు పైగా ఎటువంటి అనుమతుల్లేకుండా నడుస్తున్నాయి. అక్కడ ఆశ్రయం పొందే వారి వివరాలు తప్పనిసరిగా సేకరించి భద్రపరచాలని పలుమార్లు పోలీసులు హెచ్చరించినా నిర్వాహకులు తేలిగ్గా తీసుకుంటున్నారు.

నకిలీ ఆధార్‌కార్డులు, ఇతర వ్యక్తుల చిరునామాతో ఎక్కువగా యూపీ, మహారాష్ట్ర, బిహార్ నుంచి వచ్చిన దొంగలు ఇక్కడ మకాం వేస్తున్నారు. వీధుల్లోకి రావాలంటే భయమే

విద్యాసంస్థలు, శిక్షణకేంద్రాలు, షాపింగ్‌మాల్స్, వ్యాపార కార్యాకలాపాలతో రద్దీగా ఉంటాయి. ఇక్కడ రాత్రయితే బయటకు రావాలంటే స్థానికులు హడలెత్తుతున్నారు. ద్విచక్రవాహనాలపై దూసుకెళ్లే కుర్రాళ్లు. మత్తులో ఊగిపోతూ గొడవలకు దిగుతున్నారు. ఎస్సార్‌నగర్, ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ, బీకేగూడ, బల్కంపేట ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు తరచూ హల్‌చల్ చేస్తుంటాయి. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో మత్తు పదార్థాలు తీసుకొని గొడవలు సృష్టించిన యువకులను పోలీసులు అరెస్టు చేశారు.

# 'తిర'కాసులుంటే అనుమతులు




హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లకు అనుమతులిస్తున్న వ్యవహారం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ (హైడ్రా) క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. 40 ఏళ్ల కిందటి లేఅవుట్లలో పార్కులు, విద్యా సంస్థలకు టాయించిన స్థలాలను కొందరు రాజకీయ నేతలు అక్రమంగా తమ అధీనంలోకి తెచ్చుకొని అమ్ముతున్నారు. కొందరు కాసుల కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

**రంగంలోకి అధికారులు..**అమీన్‌పూర్ దగ్గర 9 ఎకరాల్లో 1980లో ఒక రియల్టర్ వెంచర్ వేశారు. ఇందులో పార్కు, పాఠశాల భవనం తదితర వాటికి కేటాయించిన స్థలాలను కీలక రాజకీయ నేత సోదరుడు రంగప్రవేశం చేసి ఈ వెంచర్‌లో దాదాపు 13 వేల గజాల స్థలాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నారు. దీంతో మిగతా వారికి ఇళ్ల నిర్మాణానికి అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. సదరు నేత కుమారుడికి మాత్రం అనుమతులు ఇస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కమిషనర్ రంగనాథ్ సోమవారం ఈ అక్రమాలన్నింటినీ పరిశీలించారు.

కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో అనేక చెరువు భూముల్లో భారీ అక్రమ భవనాలను నిర్మించారని తేలడంతో వాటిని కల్చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అమీన్‌పూర్ చెరువు దగ్గర ఎఫ్‌టీఎల్ భూముల్లో కొన్నేళ్ల కిందట వెంచర్‌కు అధికారులు కనీసం రికార్డులను కూడా పరిశీలించకుండానే అనుమతులిచ్చారు. తప్పుడు అనుమతులు ఇచ్చిన హెచ్ఎండీఏ అధికారులపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

నిబంధనల ప్రకారం చెరువు అలుగు ఎత్తును బట్టి నీటి ప్రవాహం ఎంతవరకు ఉంటుందనే దానిపై ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తారు. యాప్రాల్ చెరువు దగ్గర కొందరు అక్రమాలకు తెరలేపారు. భూములను ఎఫ్‌టీఎస్ నుంచి తప్పించడానికి అలుగు ఎత్తును తగ్గించారు. దీంతో అనేకమంది భూములు ఎఫ్‌టీఎల్‌లో లేకుండా చేసుకున్నారు.

హైడ్రాకు ప్రత్యేక పోలీసు స్టేషన్

హైడ్రాకు ప్రత్యేకంగా ఠాణా ఏర్పాటు చేయుడానికి ప్రభుత్వం అంగీకరించింది. వచ్చే వారంలోగా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఏర్పాటైతే హైడ్రా నమోదు చేసే కేసులన్నీ ఈ ఠాణా అధికారులే దర్యాప్తు చేస్తారు.

# పాఠశాలల పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు

కరీంనగర్ : పాఠశాలల్లో ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా పారిశుద్ధ్య సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అపరిశుభ్ర పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయులు సొంత డబ్బులతో పరిశుభ్రం చేయించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది సర్కారు బడుల్లో చేరడం లేదు. ఈనెల 2న హైదరాబాద్‌లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలల్లో పారిశుద్ధ్య బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తూ రూ.79 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులను సైతం నియమిస్తామన్నారు. ఈమేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఆదేశాలు కూడా జారీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు సర్వీసు వర్కర్లు, స్కావెంజర్లను నియమించుకునే బాధ్యతలను అప్పగించారు. అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వ బడుల్లో స్వచ్ఛదనం మెరుగుపడేలా చూడాలి.

**ప్రధాన సమస్య ఇదే..**

జిల్లాలోని సర్కారు బడుల్లో అటెండర్ల కొరతకు తోడు తాత్కాలిక సర్వీసు వర్కర్లు, స్కావెంజర్లను కరోనాకు ముందు తొలగించారు. అప్పటి నుంచి పాఠశాలల్లో మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగించింది. పలు పాఠశాలల్లో స్థానిక సంస్థల



సిబ్బంది పారిశుద్ధ్య సేవలందిస్తున్నా.. మెజారిటీ బడుల్లో మొక్కుబడిగా జరుగుతున్నాయి. ముఖ్యంగా మరుగుదొడ్లను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. మరో వైపు 2020 వరకు జిల్లాలోని 651 పాఠశాలల్లో కొంతకాలం పని చేసిన 681 మంది సర్వీసు వర్కర్లు, స్కావెంజర్లకు ఉపాధి కరవైంది.

**అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యత..**

పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించింది. కమిటీలు విద్యార్థుల సంఖ్య ఆధారంగా తాత్కాలిక పద్ధతిలో సర్వీసు వర్కర్లు, స్కావెంజర్లలను బడుల్లో నియమించాలి. కమిటీల బ్యాంకు ఖాతాలకు నెల నెల పారిశుద్ధ్య నిర్వహణ నిధులను ప్రభుత్వం విడుదల చేయనుంది. సర్వీసు వర్కర్లు, స్కావెంజర్లు నిత్యం పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆవరణలు శుభ్రం చేయాలి. అవసరమయ్యే వస్తు సామగ్రిని పాఠశాలల నిర్వహణ గ్రాంట్ నుంచి వాడుకోవాలి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలోని పాఠశాలల్లో అపరిశుభ్రత తొలగి ఆహ్లాదకర వాతావరణం నెలకొననుంది.


# నల్లా తిప్పితే.. గరళం

పాల్వంచ : నగర, పట్టణ వాసులకు గరళ జలాలే దిక్కవుతున్నాయి. ఏటా వర్షాకాలం సీజన్‌లో కలుషితానికి తోడు సరిగా శుద్ధిచేయని తాగునీరు సరఫరా అవుతోందన్నది పురవాసుల ఆందోళన. నీటి నమూనాల సేకరణ, నాణ్యత పరీక్షలతో పాటు దిద్దుబాటు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సక్రమంగా లేని తాగునీటి సరఫరా వ్యవస్థ, అరకొర శుద్ధి ప్రక్రియ.. వెరసి వర్షాకాలంలో పురపాలకాల్లో కలుషిత జలాలే సరఫరా అవుతున్నాయి. లీకేజీల కారణంగా రంగుమారిన నీళ్లు దిక్కవుతున్నా పట్టించుకునే పరిస్థితులు ఉండడం లేదు. నిబంధనల ప్రకారం పురపాలకాల్లో ఏటా నాలుగు సార్లు తాగునీటి నాణ్యత నిర్ధారణ పరీక్షలు సమగ్రంగా నిర్వహించాల్సి ఉంది. ఈ అంశానికి సిబ్బంది పాతర వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా కలుషిత జలాలు తాగుతున్న వారిలో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు, జ్వరాలు వంటివి ప్రబలుతున్నాయి. ఆసుపత్రుల్లో కొద్దిరోజులుగా రోగుల సంఖ్య పెరుగుతోంది.

నీటి పరీక్షలు తప్పనిసరి

మున్సిపాలిటీల్లో నేచరల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డీసీ) అధికారులు ఏటా నీటి నాణ్యత నిర్ధారణకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం మూడు దశల్లో కొనసాగుతుంది. ఫిల్టర్‌బెడ్స్, వాటర్ ట్యాంక్‌లు, గృహ సముదాయాల నల్లా



కనెక్షన్ల నుంచి నమూనాలను వేర్వేరుగా సేకరించాలి. ఫలితాలను పురపాలకాధికారులకు నివేదించాలి. శుద్ధి, సరఫరాలో ఎక్కడైనా లోపాలుంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో పాటు ఫిల్టర్‌బెడ్లలో మడ్డి తొలగించేందుకు ఆలంను సరైన మోతాదులో కలిపేలా అధికారులు పర్యవేక్షించాలి. ఆ నిల్వల్ని అందుబాటులో ఉంచాలి. అక్కడి పురపాలక సిబ్బంది సైతం ప్రతీరోజు క్లోరిన్ టెస్ట్ కిట్ల ద్వారా నాణ్యతా స్థాయులను పరీక్షించాలి. కానీ.. పరీక్షలు, తగిన జాగ్రత్తలు ఎక్కడా పాటించే పరిస్థితి లేదు. వాటర్ ట్యాంకులను సరిగా శుభ్రం చేయడం లేదని పురవాసులు వాపోతున్నారు. పబ్లిక్ కుళాయిలు, బస్టాండ్ ఏరియాలు, మురికివాడలు, విద్యాలయాలకు బిగించిన కుళాయిల్లోంచి నమూనాలను సేకరించి పరీక్షించడం లేదు. ఇకనైనా ఈ వ్యవస్థను పటిష్ఠపరచాలి. పైపులైన్ల నిర్వహణను సక్రమంగా చేపట్టడంతో పాటు వాల్వ్‌ల లీకేజీలను అరికట్టాలి. మురుగు కాల్వల్లోంచి వెళ్లే పైపులను మార్చాలి. అప్పుడే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఖమ్మం నగరంలో 15 రోజులకోసారి నీటి నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నారు. కానీ, లీకేజీలతో రంగుమారిన నీరు పలు కాలనీలకు సరఫరా అవుతోంది. దీనిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. పకడ్బందీగా నిర్వహిస్తాం..ఈ సీజన్‌లో తాగునీరు సరఫరా వ్యవస్థపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగిస్తాం. కలుషిత జలాలు సరఫరా కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. లీకేజీలను ఎప్పటికప్పుడు పరిష్కరిసున్నాం. ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం.

# వీధి వ్యాపారులకు అడ్డా కరవు!

పెద్దపల్లి : రహదారులపై ఇబ్బందులు తలెత్తకుండా వీధి వ్యాపారులకు ప్రత్యేక ప్రాంతం కేటాయించాలన్న ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికలతోపాటు ప్రధాన పట్టణాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.. దీంతో రహదారుల పక్కన.. చౌరస్తాల్లో ఎక్కడ పడితే అక్కడ వీధి వ్యాపారులు స్టాళ్లు ఏర్పాటు చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.. ఉమ్మడి జిల్లాలో 1.82 లక్షల వీధి వ్యాపారులు ఉండగా వీరికి ప్రత్యేక జోన్లు లేకపోవడంతో రద్దీ ప్రాంతాల్లో వీరి దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రహదారులు ఇరుగ్గా మారడంతోపాటు రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. వీరికి విక్రయ జోన్లు ఏర్పాటు చేయడం వల్ల ఆ వ్యాపారులంతా ఒకే దగ్గర ఉండే అవకాశంతోపాటు కొనుగోలుదా రులకు వెళ్లడం సులువవుతుంది. పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక జోన్ల ఏర్పాటుపై దృష్టి పెడితే తప్ప ఈ ఇబ్బందులు తొలగే అవకాశం లేదు

కొనుగోలుదారులు రారనే భయంతో..

వీధుల్లో.. రహదారుల పక్కన విక్రయ బండ్లు, స్టాళ్లు ఉంటే కొనుగోలుదారులు వస్తారని.. ఎక్కడో ప్రత్యేక ప్రాంతంలో ఏర్పాటు చేస్తే రారనే ఆందోళనతో చాలామంది వీధి వ్యాపారులు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసిన పట్టణాల్లోనూ అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రత్యేక జోన్లలో తాము దుకాణాలు ఏర్పాటు చేసిన తరవాత తాము ప్రస్తుతం ఉన్న ప్రాంతాల్లో వేరేవారు దుకాణాలు ఏర్పాటు చేస్తే తమ ఉపాధి దెబ్బతినడం ఖాయమని భయపడుతున్నారు. అన్ని పట్టణాల్లో అధికారులు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయడంతోపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ తప్ప వేరే ప్రాంతాల్లో వీధి వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటేనే అందరు వ్యాపారులు సహకరించే



అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

రామగుండం నగరపాలిక పరిధిలో లక్ష్మీనగర్, మార్కండేయ కాలనీ, ఎన్టీపీసీ (జ్యోతినగర్)కి సమీపంలో, బస్టాండ్‌ల వద్ద తాత్కాలికంగా విక్రయ జోన్లు ఏర్పాటు చేసినా పెద్దగా ఉపయోగించుకోవడం లేదు.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పాత కూరగాయలు, పండ్ల మార్కెట్‌ను పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తామని చెప్పినప్పటికి అతీగతీ లేదు. రెండేళ్లుగా ఇక్కడ దుకాణ సముదాయాల నిర్మాణం నత్తనడకన సాగుతుండటమే కారణమని వీధి వ్యాపారులు చెబుతున్నారు.

జగిత్యాల, కోరుట్లలలో బస్టాండులకు సమీపంలోనే ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికి అతీగతీ లేదు. వేములవాడ, సిరిసిల్లలలో రహదారుల పక్కనే విక్రయిస్తారు. వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయలేదు.

కరీంనగర్ స్మార్ట్ సిటీ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఫుట్‌పాత్‌లపై రాత్రి వేళల్లో ప్రత్యేకంగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయగా కొంత స్పందన ఉంది. కరీంనగర్ కిసాన్ నగర్‌లో రెండు, చైతన్యపురి, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక, వేంకటేశ్వరాలయం వద్ద, ఇందిరానగర్, బస్టాండ్ వెనుక ప్రత్యేకంగా జోన్లు ఏర్పాటు చేసినా వ్యాపారులు పెద్దగా ఉపయోగించుకోవడం లేదు.

# కరుగుతున్న గుట్టలు!

సిరిసిల్ల : ప్రకృతి సంపద అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించే భారీ ప్రాజెక్టులేవీ లేవు. గనులశాఖ నుంచి ఎలాంటి అనుమతులివ్వలేదు. అయినా గుట్టల్లో నిరంతరం మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్ల రూపాయల రాయల్టీకి గండి పడుతోంది. గ్రానైట్, కంకర క్వారీల మాదిరిగానే మట్టి తవ్వకాలకు అనుమతులిచ్చేలా ప్రతిపాదన చేశారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న మట్టి తవ్వకాలతో గుట్టలు కరిగిపోతున్నాయి. వేములవాడ మండలం అగ్రహారం, తెట్టెకుంట, చంద్రగిరి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల పట్టణం రగుడు పరిధిలోని గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వుతూ పురపాలికలు, మండల కేంద్రాల్లో విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు దూరాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 5 వేలపైనా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. సాధారణ రోజుల్లోనూ తక్కువగా రవాణా జరుగుతుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గుట్టల్లో నిరంతరాయంగా సాగుతున్న తవ్వకాలతో అందులోని నెమళ్లు గ్రామాలకు వస్తున్నాయి. ఇటీవల పెద్దూరులోకి వచ్చిన నెమలి ఎండవేడిమిని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు దప్పిక తీర్చడంతో తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. తెట్టెకుంట, చంద్రగిరి గుట్టల్లో గతంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. గుట్టపై పడిన వర్షపునీరు నిలిచేలా ఉపాధి హామీలో కాంటూరు కందకాలు తవ్వారు. మట్టి తవ్వకాలతో వీటి ఆనవాళ్లేవీ కానరావడం లేదు. ఇక్కడ మట్టి తరలింపునకు ప్రత్యేకంగా ప్రైవేట్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసుకున్నారు.

అటకెక్కిన అనుమతుల ప్రక్రియ

మట్టి తవ్వకాలకు గతంలో మైనింగ్‌శాఖ ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు చేశారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలకు అనువైన స్థలాలను గుర్తించాలని ఉత్తర్వులు కూడా విడుదలయ్యాయి. దీనికోసం వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పేజీని రూపొందించారు. అందులో భూమి డీజీపీఎస్ సర్వే చిత్రం, ఎమ్మార్వో నుంచి నిరభ్యంతర పత్రం, ఐటీ రిటర్న్‌లు, గనులశాఖ పాత బకాయిలు లేకుండా చూసుకోవాలి. వీటన్నింటితోపాటు రూ. లక్ష చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చాక రూ. 4 లక్షలు చెల్లించాలి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలు వేటికైనా టన్నుకు ఇంత అని ఒక ధరను నిర్ణయిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు అనుమతులు తీసుకునే క్రమంలోనే మట్టి వాడకాన్ని బట్టి సీనరేజీ రూపంలో ప్రభుత్వానికి డబ్బులు జమవుతాయి. తొలుత దీనిపై హడావుడి చేసినా తర్వాత దీని ఊసేలేకుండా పోయింది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అక్రమ మట్టి తవ్వకాలపై దాడులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. వారి నుంచి పెనాల్టీ వసూలు చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తున్నాం. జిల్లాలో మట్టి తవ్వకాలకు ఎలాంటి లీజులు లేవు. మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# భూముల విలువ పెంపుదలకు అధ్యయనం




తాండూరు: ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్‌లు, తహశీల్దార్లు అధ్యయనం ప్రారంభించారు. భూముల విలువ పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే ఈ విలువ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఆదేశాలు రావడంతో ఆమేరకు అధికారులు కసరత్తు చేపడుతున్నారు.

డిమాండ్ ఉన్న సర్వే నంబర్ల సేకరణ

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఏరియాను బట్టి వాస్తవ ధరలకు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలకు భారీ వ్యత్యాసం ఉంటోంది. ఈ అంతరాన్ని తగ్గించే విధంగా కసరత్తు మొదలు పెట్టారు. జిల్లాలోని పురపాలిక, మండల, జిల్లా కేంద్రం వికారాబాద్‌తో పాటు ప్రధాన గ్రామాల్లో డిమాండ్ ఉన్న సర్వే నంబర్లు ఏవి అనే విషయాన్ని అధికారులు సేకరించే ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర, జాతీయ రహదారుల వారగా వ్యవసాయేతరానికి అనువైన ప్రాంతాలు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాల్లో డిమాండ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థలాలకు విలువ కట్టబోతున్నారు.

నివేదికను కమిటీకి అందిస్తారు

ఈ నెలాఖరు వరకు ఏ సర్వే నంబర్లోని భూమికి ఎంత విలువ పెంచాలనే విషయంలో ఓ నిర్ణయానికి వచ్చి నివేదికను జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే కమిటీకి అందజేస్తారు. ఈ కమిటీ అభ్యంతరాలు స్వీకరిస్తుంది. సమస్యలను పరిష్కరించాక మార్కెట్ విలువ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా చేసి ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్లను అమలు చేస్తారు.

పరిహారం విషయంలో ఆందోళన

భారాస ప్రభుత్వం 2020-21ల రాష్ట్రంలో భూములకు తక్కువ ధరలు ఉన్న ప్రదేశాల్లో 50 శాతం, ఎక్కువ వుంటే 30 శాతం, మధ్యస్తంగా ఉన్న భూములకు 40శాతం చొప్పున ధరలు పెంచింది. జిల్లాలో రహదారులు, ఇతర నిర్మాణ ప్రదేశాల్లో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం రికార్డుల్లో పేర్కొన్న మేరకు విలువను బట్టి పరిహారం చెల్లించడానికి నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఇది సదరు భూ యజమానులకు నప్పక న్యాయస్థానాలను ఆశ్రయించడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

22న సమర్పించాల్సి ఉంటుంది

భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి ఈనెల 22న ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమేరకు సబ్ రిజిస్ట్రార్లు కసరత్తు ప్రారంభించారు. - అన్వర్, తాండూరు సబ్‌రిజిస్ట్రార్.

# చేప పిల్లల పంపిణీ జాడేదీ!



పెద్దపల్లి : మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేపల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వానాకాలం ఆరంభమైనప్పటికీ ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో మత్స్యకారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఆ దిశగా ప్రయత్నాలు కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. పథకం ప్రారంభమైన ఎనిమిదేళ్లలో ఏనాడూ సజావుగా అమలు కాలేదు. ప్రతిసారీ ఏదో ఒక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిర్యాదులు పట్టించుకోని ప్రభుత్వం

ప్రతి సంవత్సరం పంపిణీ చేసే చేప పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ అధికారులు కచ్చితమైన ప్రమాణాలు పాటించడం లేదు. నిర్ణీత పరిమాణం కన్నా చిన్నగా ఉన్న పిల్లలను పంపిణీ చేయడం, టెండర్ల ప్రక్రియలో గోల్‌మాల్, చేపల్లో ఎదుగుదల లోపం వంటి సమస్యలపై మత్స్యకారుల ఫిర్యాదులను ప్రభుత్వం పట్టించుకోలేదు. నిబంధనల మేరకు పెద్ద సైజు పిల్లలు 80-100 మి.మీ., చిన్న సైజువి 35-40 మి.మీ. ఉండాలి. కాగా అంతకన్నా తక్కువ సైజున్న పిల్లలను చెరువుల్లో వదలడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిమాణం తక్కువగా ఉండటంతో ఎదుగుదల లోపంతో చిన్న చేప పిల్లలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

16 వేల మందికి ఉపాధి

జిల్లాలో చెరువులు, కుంటలతో పాటు పార్వతీ (సుందిళ్ల) బ్యారేజీ, శ్రీపాద(ఎల్లంపల్లి) జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకం చేపడుతున్నారు. మొత్తం 2,001 పురుష మత్స్య సహకార సంఘాల్లో 14,116 మంది, 39 మహిళా సంఘాల్లో 2 వేల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. గడిచిన ఎనిమిదేళ్లలో 913.13 లక్షల చేప పిల్లలు, 152.04 లక్షల రొయ్య పిల్లలు పంపిణీ చేయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. అయితే మత్స్యకారులకు చేతి నిండా పని దొరికింది. గతేడాది వేసవి ఆరంభంలోనే చాలా చోట్ల నీటి వనరులు అడుగంటడంతో నష్టం వాటిల్లింది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం అనుమతి ఇస్తే ఏర్పాట్లు

ఏటా చేప పిల్లల పెంపకంతో జిల్లాలో మత్స్యకారులకు ఉపాధి పొందుతున్నారు. చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. ప్రస్తుత ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తే పంపిణీకి ఏర్పాట్లు చేస్తాం.

# నిధులు రాక.. మరమ్మతు చేపట్టక

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ పెద్దచెరువు ఇది. చెరువులోకి నీరు చేరే మాటు కాలువ దెబ్బతిని వరద కాలువలోకి నీరు చేరుతోంది. మాటు కాలువను పునరుద్ధరించకపోవడంతో చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. చెరువు నిండకపోతే భూగర్భ జలాలు తగ్గి పరిసరాల్లోని బోరు బావులు వట్టిపోయే ప్రమాదం ఉందని, తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుపై ఆధారపడ్డ మత్స్యకారుల ఉపాధి కరవవుతుందని పేర్కొంటున్నారు. వరద కాలువ కట్ట, చెరువు మాటు కాలువ మరమ్మతుకు రూ. 21 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాక తిప్పలు తప్పడం లేదు. గతంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు చెరువులకు నష్టం వాటిల్లింది. కొన్ని చెరువుల కట్టలకు గండ్లు పడగా, మరికొన్నింటి తూములు, అలుగులు దెబ్బతిన్నాయి. తూముల షట్టర్లు శిథిలావస్థకు చేరుకొని తెరచుకోకపోవడంతో వాటి కింద పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. జల వనరుల శాఖ అధికారులు మరమ్మతు కోసం నివేదికలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదించగా, కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో సుమారు 1072 చెరువులు, కుంటలుండగా, వీటి కింద వేలాది ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. దెబ్బతిన్న చెరువుల కట్టలు, అలుగులు, తూములకు ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు సక్రమంగా నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో చెరువుల మరమ్మతుపై దృష్టిసారించాల్సి ఉండగా, నిధులు మంజూరు కాక పట్టించుకునే వారే కరవయ్యారు. మెట్‌పల్లి మండలం మాదిగకుంటకు రూ. 12.70 లక్షలు, బండలింగాపూర్ పెద్దచెరువుకు రూ. 40 లక్షలు, ఆత్మకూర్ పెద్దచెరువు కట్ట మరమ్మతుకు రూ. 19.30 లక్షలు, ఆత్మకూర్ పెద్దచెరువు శాశ్వత మరమ్మతుకు రూ. 49.40 లక్షలు, చౌలమద్ది కృష్ణాద్రి చెరువుకు రూ. 36.80 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో ఆత్మకూర్ పెద్దచెరువుకు మాత్రమే నిధులు మంజూరై టెండరు దశలో ఉంది.



తాత్కాలిక చర్యలతోనే..

చెరువులకు నిధులు మంజూరు కాకపోవడంతో తాత్కాలికంగా మరమ్మతు చేపడుతూ సరిపెడుతున్నారు. వర్షాకాలం రావడంతో చెరువులకు ముప్పు వాటిల్లకుండా ప్రస్తుతానికి కట్టల వద్ద మొరం, తూములకు మరమ్మతు చేస్తున్నారు. అయినప్పటికీ భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు బుంగలు పడి నీరంతా వృథాగా వెళ్లిపోయింది. కొన్ని చోట్ల తూముల షట్టర్లు లేవకపోవడం, మరికొన్ని చోట్ల లీకేజీ సమస్యలున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శాశ్వత మరమ్మతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

దెబ్బతిన్న చెరువులు, కుంటల శాశ్వత మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాము. నిధులు రాగానే పనులు చేపడతాము. ఆత్మకూర్ పెద్దచెరువుకు నిధులు మంజూరై టెండరు దశలో ఉంది. పూర్తి కాగానే పనులు చేపడతాము. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాము. అరుణ్‌కుమార్, డీఈ

# సౌర వెలుగు.. ఆదాయం బాగు

మధిర : మధిరకు చెందిన వ్యాపారి మణికంఠ తన ఇంటిపైన 384 చ.యూ. స్థలంలో 10కేవీ సోలార్ ప్యానల్స్‌ను అమర్చారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 90వేల వరకు రాయితీ వచ్చింది. ఈ యూనిట్‌కు రూ. 5 లక్షల ఖర్చయింది. దీంతో నెలకు వెయ్యి యూనిట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది.

విద్యుత్తు వినియోగం రోజు రోజుకు పెరిగిపోతోంది. అందుకు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరగడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజనను ప్రవేశపెట్టింది. ఇంటిలోనే సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేసి తాము వినియోగించుకోవడంతోపాటు మిగిలిన మొత్తాన్ని విద్యుత్తు సంస్థకు విక్రయించి ఆదాయం పొందవచ్చు. ఇలా మధిరలో పలువురు రాయితీ యూనిట్లు ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈనేపథ్యంలో పథకం తీరుపై కథనం..

సూర్య ఘర్‌యోజన తీరిది

కేంద్ర ప్రభుత్వం రాయితీతో సౌరవిద్యుదుత్పత్తి యూనిట్‌లు అందిస్తోంది. యూనిట్‌లో తయారయ్యే విద్యుత్తు గ్రిడ్‌కు చేరుతుంది. దీనికి ప్రత్యేకంగా ఒక మీటరును అమర్చుతారు. ఉత్పత్తిలో వినియోగి



ంచినది పోను మిగిలిన విద్యుత్తు యూనిట్లను లెక్క కట్టి వినియోగదారుడి ఖాతాకు సొమ్మును జమచేస్తారు. ఇలా ఆరు నెలలకోసారి జమ అవుతుంది. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తారు. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు మధిర పట్టణంలో మరో 12 మంది వినియోగదారులు ముందుకు వచ్చి సంబంధిత ఏజెన్సీలకు దరఖాస్తు చేశారు. వీరందరికి రాయితీ మీద పథకాన్ని అమర్చేందుకు అనుమతులు లభించాయి. జిల్లాలో పదుల సంఖ్యలో దరఖాస్తులు రాగా 300 దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు అధికారులు తెలిపారు.

5కేవీ సోలార్ ప్యానల్స్ అమర్చాం

పెట్రోల్ బంకుకు 5కేవీ విద్యుత్తు తయారయ్యే సోలార్ ప్యానల్స్‌ను అమర్చాం. ఇది ఐఓసీఎల్ ద్వారా రాయితీపై వచ్చింది. మొత్తం ప్రాజెక్టు రూ. 3.6 లక్షలు కాగా రూ. 1.6 లక్షలు రాయితీ వచ్చింది. మిగతా రూ. 2 లక్షలు చెల్లించాను. ఇక్కడ తయారైన విద్యుత్తు గ్రిడ్‌కు వెళుతుంది. విద్యుత్తు సంస్థ నుంచి కరెంటు వాడుకుంటున్నాం. ప్రతినెలా రూ. 10వేల వరకు బిల్లు వచ్చేది. రెండు నెలలుగా బిల్లు రాలేదు. లక్కిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర

చాలా మంచి పథకం

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూర్య ఘర్ యోజన చాలా ఉపయోగకరంగా ఉంది. మా సొంత భవనం మీద 25 ప్యానల్స్ ఏర్పాటు చేశాం. గతంలో మా ఇంటికి రూ. 8వేల వరకు బిల్లు వచ్చేది. ఇప్పుడు జీరో బిల్లు వస్తోంది. ప్యానల్స్ మీద దుమ్ము పడితే నీటితో శుభ్రం చేసుకుంటే మంచిది. కోనా మణికంఠ, మధిర

జిల్లాలో 300 దరఖాస్తులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనకు ఆన్‌లైన్ ద్వారా జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తుల్లో 300ల మంది వినియోగదారులకు ఫీజుబులిటీ ఉందని గుర్తించాం. వీరందరికి ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వపరంగా రాయితీ లభిస్తుంది. త్వరలోనే దీనికి సంబంధించి రెడ్కో సంస్థ పనులు ప్రారంభిస్తారు. వి. సురేందర్, విద్యుత్తు సంస్థ ఖమ్మం ఎస్‌ఈ

# యథేచ్ఛగా తోడేస్తున్నారు..!

దుమ్ముగూడెం : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన ఇసుక ర్యాంపులో కొందరి స్వార్థం కారణంగా అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలను సక్రమంగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం అవేమీ పట్టించుకోకుండా మిన్నకుండిపోతోంది. దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామ పంచాయతీలోని నందులచెలక ఇసుక ర్యాంప్ అక్రమాలకు అడ్డాగా మారింది.

గుత్తేదారుల చేతుల్లోకి...

నడికుడి గ్రామ పంచాయతీలోని నందులచెలక గ్రామ సమీపంలో ప్రభుత్వం అధికారికంగా ఓ ఇసుక ర్యాంపును ఏర్పాటు చేసింది. కొందరు గిరిజన మహిళల పేరిట మైనింగ్ అధికారులు.. 25మంది సభ్యులతో ఓ సొసైటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. గోదావరి ర్యాంపు నుంచి దాదాపు 12ఎకరాల్లో సుమారు 49,500 క్యూబిక్ మీటర్ల ఇసుకను కూలీల సహాయంతో తీసుకెళ్లడానికి గిరిజన మహిళా సొసైటీకి అనుమతులు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు కథ కొద్దిరోజుల నుంచి ప్రారంభమైంది. ప్రస్తుతం నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇసుక ర్యాంపు నిర్వహణ సాగుతోంది. గోదావరి నది ఒడ్డున ఉన్న ఈ ఇసుక ర్యాంపు కొందరు గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లింది. ఇక్కడ వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది.


సొరంగాలను తలపించేలా..

ఈ ఇసుక ర్యాంప్‌లో కూలీల సహాయంతో ట్రాక్టర్లలో ఇసుక నింపాలనేది ప్రభుత్వ నిబంధన. ఇది ఇక్కడ మచ్చుకైనా కానరావడం లేదు. గుత్తేదారులు రాత్రిపూట యంత్రాల సాయంతో ఇసుకను తోడేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇలా ఇసుక తోడటంతో గోదావరి పరివాహక ప్రాంతంలో అనేక చోట్ల సొరంగాలను తలపించేలా పరిస్థితి తయారైంది. ఓపక్క వర్షాకాలం ముంచుకొస్తుండడంతో గుత్తేదారులు ముందుచూపుతో వేలాది టన్నుల ఇసుకను అక్రమంగా అనేక ప్రదేశాల్లో నిల్వలు పెడుతున్నారు. టిప్పర్లు, యంత్రాలు యథేచ్ఛగా నదిలో తిరగడానికి అక్రమంగా ఓ రోడ్డునే నిర్మించారు. రాత్రి సమయంలో యంత్రాలతో తరలించడాన్ని నిరసిస్తూ మూడు రోజుల కిందట స్థానిక ప్రజలు అడ్డుకున్నా ఇసుక అక్రమ దందా ఆగటం లేదు. అనుమతులు లేకుండానే ప్రభుత్వ గుట్ట ప్రాంతం నుంచి మట్టి తవ్వకాలు చేసి ఇసుక ర్యాంపునకు రోడ్డును ఏర్పాటు చేసుకున్నా రెవెన్యూ అధికారులు నోరు మెదప లేదనే ఆరోపణలూ ఉన్నాయి.

చర్యలు చేపడతాం

ఇటీవలే ఇసుక ర్యాంపు నిర్వహణకు అనుమతులు మంజూరు చేశాం. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను తరలించవద్దని నిర్వాహకులను ముందే హెచ్చరించాం. యంత్రాలతో తరలిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు చేపడతాం. దినేష్‌కుమార్, కొత్తగూడెం మైనింగ్ ఏడీ

# సోషల్ మీడియాలో వైసీపీ కుట్రలు..ఏం చేస్తున్నారంటే?




అమరావతి: కుట్రలకు పెట్టింది పేరు వైఎస్సార్‌సీపీ!!. అధికారంలో ఉన్నా.. విపక్షంలో ఉన్నా పన్నాగాలకు తెరతీయడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్యలా అనిపిస్తాయి ఆ పార్టీ కుయుక్తులు. ఇక గత ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఏమాత్రం ముందుకు తీసుకెళ్లలేకపోయిన ఆ పార్టీ ఇప్పుడు.. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ ప్రయత్నాలకు భంగం కలిగించాలని చూస్తోంది. ఈ మేరకు తాజాగా సోషల్ మీడియా వేదికలుగా ఆ పార్టీ కుట్ర బయటపడింది. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా సోషల్ మీడియాలో వైసీపీ కుట్రలకు తెరలేపింది. ఏపీకి పెట్టుబడులు రాకుండా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోంది. యూట్యూబ్ అకాడమీ పెట్టాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు వైసీపీ సోషల్ మీడియా గండి కొడుతోంది. ఏపీలో శాంతి భద్రతలు సరిగా లేవంటూ యూట్యూబ్, గూగుల్‌కు ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతోంది. పెట్టుబడులు పెట్టాలన్నా, అకాడమీ పెట్టాలన్నా హైదరాబాద్‌కు వెళ్లండంటూ వైసీపీ శ్రేణులు సలహాలు, సూచనలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఇప్పటికే వైసీపీ దుష్ప్రచారం మొదలుపెట్టింది. దీంతో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరిస్తోందంటూ ఇప్పటికే ప్రభుత్వం మండిపడుతోంది. ప్రభుత్వ అనుమానాలకు వైసీపీ సోషల్ మీడియా పోస్టింగులు బలం చేకూరుస్తున్నాయి. ఏపీకి పెట్టుబడులు రాకుండా, సంపద సృష్టి జరగకుండా వైసీపీ ఈ పన్నాగం పన్నింది.

**ఏపీ పునర్నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి..** ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టిసారించింది. రెండు నెలల క్రితం ఏర్పడిన టీడీపీ - బీజేపీ %-%జనసేన కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిసారించి క్రమక్రమంగా అడుగులు వేస్తోంది. నరేంద్ర మోదీ ప్రధానిగా, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా డబుల్ ఇంజన్ సర్కార్ కొనసాగుతోంది. సంపద సృష్టిపై ప్రభుత్వం దృష్టిసారించింది. వీటితో పాటు రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ఈ రెండింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బృహత్తరమైన ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే అదనపు స్థూల జాతీయ ఉత్పత్తిని అందించడానికి, రాష్ట్రానికి అపారమైన సంపద సృష్టికి దోహదపడతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మరోవైపు రాష్ట్రంలోని సాధారణ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. కానీ వైఎస్సార్‌సీపీ మాత్రం రాష్ట్రాన్ని ఏవిధంగా దెబ్బతీయాలా అనే కుట్రలకు పాల్పడుతోంది.




# పొలిట్ బ్యూరో సమావేశంలో చంద్రబాబు కీలక నిర్ణయాలు

అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టీడీపీ పొలిట్ బ్యూరో పార్టీ సమావేశం గురువారం నాడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగింది. ఈ భేటీ కాసేపటి క్రితమే ముగిసింది. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. రెండున్నర గంటలపాటు ఈ సమావేశం సాగింది. నామినేటెడ్ పదవులపై చంద్రబాబు చర్చించారు. వీలైనంత త్వరగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**పేదరిక నిర్మూలనపై..** పొలిట్ బ్యూరో సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మీడియాకు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. "దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతుంది. జనాభా నిష్పత్తి తగ్గడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయి. తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి. పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చంద్రబాబు చర్చించారు. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తాం. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటాం. జన్మభూమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. జన్మభూమి2 గా ఈ కార్యక్రమానికి నామకరణం చేయాలని భావించారు. మొన్నటి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సరిగ్గా దృష్టి పెడితే వైసీపీ గెలిచిన సీట్లలో మరో నాలుగు నుంచి ఐదు సీట్లు టీడీపీ గెలిచేది" అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**డీలిమిటేషన్‌లో అన్యాయం: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి :** పొలిట్ బ్యూరోలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 55 రోజుల పాలనపై అధినేత చంద్రబాబు చర్చించారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. "త్వరలో జన్మభూమి2 ప్రారంభం కాబోతుంది. జన్మభూమి -2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. వర్షాలతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా ఉన్నాయి. ప్రాజెక్టులు నిండటంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గుండె నీరు కారుతోంది. నామినేటెడ్ పోస్టులను అతి త్వరలో భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇసుకలో అక్రమాలు సహించబోనని అధినేత మరోసారి హెచ్చరించారు జనాభా నియంత్రణతో డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోంది. ఒక యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశంలో160 మాత్రమే ఉంటాయి. జనాభా తగ్గడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోతాయి" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు.

**విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థిపై చర్చ..!! :** విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ తొలి పొలిట్ బ్యూరో సమావేశం ఇది.

ఈ భేటీకి మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బొండా ఉమామహేశ్వర రావు, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు తదితరులు హాజరయ్యారు. ఈ భేటీలో చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# జగన్‌ను ఆ పార్టీ నేతలే భరించలేకపోతున్నారు..



అమరావతి, ఆగస్టు 8: జగన్‌ను ప్రజలు మాత్రమే కాదు..ఆయన పార్టీ నేతలూ భరించలేకపోతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో కేవలం 13 శాతం మాత్రమే అమలు చేసి ప్రజలకు పంగనామాలు పెట్టిన జగన్‌కు హామీల అమలులో చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు మాత్రమే కాదు.. ఆయన పార్టీ నేతలు కూడా వద్దనుకుంటున్నారన్నారు. పాలోమని పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరుతున్నారని తెలిపారు.

ఈ కారణంగానే విశాఖ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్లోనే కాదు.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. వరుసగా అన్ని ఎన్నికల్లో ఓడిపోతున్నా జగన్‌కు తత్వం బోధపడడం లేదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. జగన్ రెడ్డి తాను మళ్లీ సీఎం కుర్చీపైన కూర్చుంటాననంటూ పగటి కలలు కంటున్నారన్నారు. జగన్ మానసిక స్థితి బాగోలేదని ఆయన చెల్లెలు చెప్పింది నిజమే అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే అన్ని వ్యవస్థలూ విఫలమయ్యాయని జగన్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలన చేసిన గాయాల నుంచి ప్రజల ఇంకా కోలుకోలేదన్నారు. 11 సీట్ల మాత్రమే ఇచ్చి ఆ పార్టీని అధ:పాతాళానికి తొక్కిన ప్రజలు... నిజంగా జగన్ ప్రజలకు బిర్యానీనే పెట్టి ఉంటే ఎన్నికల్లో ప్రజలెందుకు దారుణంగా ఓడించారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు.

# భవిష్యత్‌లో ఏ ఎన్నిక జరిగినా ఇదే ఫలితం పునరావృతం: గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) స్థాయీ సంఘ ఎన్నికల్లో కూటమి పదికి పది స్థానాలు కైవసం చేసుకోవడం పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. 66 ఓట్ల మెజార్టీతో స్థాయీ సంఘం గెలిచామని, భవిష్యత్‌లో ఏ ఎన్నిక అయినా ఇదే ఫలితం పునరావృతం అవుతుందన్నారు. వైకాపా పార్టీని మునిగిపోయే నావగా అభివర్ణించారు. బొత్స సత్యనారాయణ, వైఎస్ జగన్‌లు నైతికత, విలువల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉందని విమర్శించారు. "వైకాపాకు 80శాతం ఓట్లు ఉన్నాయి, ఎలా ఎన్నికకు వెళ్తారని కూటమిపై విమర్శలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అభ్యర్థులను ఎలా బెదిరించి గెలిచారో అందరికీ తెలుసు. రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో కూటమికి అద్భుత తీర్పు ఇచ్చారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో పరిస్థితులు చూశాం. ఏపీలో ఎన్నికలు ఆలస్యమైతే మన రాష్ట్రంలో కూడా అదే పరిస్థితి చూసేవాళ్లం. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి విజయం పునరావృతమవుతుంది. కూటమి గేట్లు తెరిస్తే వైకాపా పూర్తిగా ఖాళీ అవడం ఖాయం" అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

# జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే.. ప్రతిపక్ష నేత కాదు

విశాఖ: జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని.. ప్రతిపక్ష నేత కాదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైసీపీకి కేవలం 11 స్థానాలే వచ్చినా.. తాము గౌరవిస్తున్నామన్నారు. అసెంబ్లీలో అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును జగన్ హేళన చేశారన్నారు. 23 మంది టీడీపీ ఎమ్మెల్యేలలో కొంత మందిని లాగేస్తే ప్రతిపక్ష నేత హోదా పోతుందని జగన్ అనలేదా? అని గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. నైతిక విలువ కోసం మాట్లాడే అర్హత జగన్‌కి లేదన్నారు. జగన్‌కి చంద్రబాబు ఫోబియా పట్టుకుందని సొంత చెల్లెలే అన్నారని గంటా తెలిపారు. జగన్‌కి మానసిక పరిస్థితి బాగోలేదని ఆయన చెల్లెలే చెబుతోందన్నారు. ఢిల్లీలో జగన్ ధర్నా చేసి అభాసుపాలు అయ్యారన్నారు. త్వరలోనే విశాఖకు మెట్రో రాబోతోందని... అలాగే ఫ్లై ఓవర్లు కూడా రానున్నాయని గంటా పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులను వేగవంతం చేశామని.. నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖను పరిపాలన రాజధాని పేరుతో వైసీపీ నేతలు నాశనం చేశారని గంటా విమర్శించారు. మాస్టర్ ప్లాన్ కూడా మార్చేశారన్నారు. త్వరలోనే కొత్త మాస్టర్ ప్లాన్ రానుందన్నారు. విశాఖ భూ కుంభకోణాలు బయట పెడతామని.. వైజాగ్ ఫైల్స్‌పై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారన్నారు. టీడీఆర్ కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గంటా వెల్లడించారు. ఋషికొండ భవనాలను ఏమి చేయాలో తమకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖలో జరిగిన స్థాయి సంఘం ఎన్నికల్లో పదికి పది గెలుచుకున్నామని గంటా శ్రీనివాసరావు తెలిపారు. కూటమి అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. త్వరలో జరగబోయే అన్ని ఎన్నికలకు ఇదే నాంది అని పేర్కొన్నారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. కూటమి గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయమని తెలిపారు. వైసీపీ మునుగుతున్న నావ అని.. ఇప్పుడు పూర్తిగా మునిగిపోయిందని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.




# జపాన్‌లో భారీ భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

టోక్యో: జపాన్‌ను భారీ భూకంపం వణికించింది. గురువారం దక్షిణ తీర ప్రాంతంలో క్యుషు ద్వీపం సమీపంలో ఇది సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.1గా నమోదైందని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. 30 కి.మీ. లోతులో భూకంప కేంద్రం నమోదైందని తెలిపింది. దాంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. భూకంపకేంద్రం సమీపంలోని విమానాశ్రయం అద్దాలు దెబ్బతిన్నాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. క్యుషు ద్వీపంలోని నిచినాన్, మియాజాకి సమీపంలోని కొన్ని ప్రాంతాలపై భూకంపం ప్రభావం ఎక్కువగా కనిపించింది. 1.6 అడుగుల ఎత్తులో అలలు కనిపించినట్లు జపాన్ వాతావరణ శాఖ వెల్లడించింది. అధికారులు నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నట్లు చీఫ్ క్యాబినెట్ సెక్రటరీ వెల్లడించారు. ప్రభావిత ప్రాంత ప్రజలు తీరానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే క్యుషు, షికోకు ప్రాంతంలోని న్యూక్లియర్ రియాక్టర్లు సురక్షితంగానే ఉన్నాయని న్యూక్లియర్ రెగ్యులేషన్ అథారిటీ వెల్లడించింది. 2011లో సంభవించిన భూకంపం, సునామీతో ఫుకుషిమా అణుకేంద్రం దెబ్బతింది. అప్పటి నుంచి ప్రకృతి ప్రకోపించినప్పుడల్లా ఈ న్యూక్లియర్ ప్లాంట్స్ భద్రతపై ఆందోళన వ్యక్తం అవుతూ ఉంటుంది.

**జపాన్‌లో అత్యధిక భూకంపాలు..** జపాన్‌లో ఏటా సగటున 5 వేల చిన్నాపెద్దా భూకంపాలు వస్తుంటాయి. అక్కడి ప్రజలు వీటిని ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. జపాన్ పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌లో ఉంటుంది. 40వేల కిలోమీటర్ల పొడవైన ఈ రింగ్ ఆఫ్ ఫైర్‌లో 450 అగ్నిపర్వతాలున్నాయి. అందులో మెజారిటీ అగ్నిపర్వతాలు జపాన్‌లోనే కనిపిస్తాయి. అవి నిరంతరం క్రియాశీలకంగా ఉంటాయి. జపాన్ 4 కాంటినెంటల్ ప్లేట్స్ చర్యలతో సంబంధం కలిగి ఉంది. ద పసిఫిక్, ద ఫిలిప్పీన్, ద యురేసియన్, ద నార్త్ అమెరికా ఫలకాలు తరచూ కదులుతూ ఉంటాయి. దాంతో కదలికలు ఏర్పడి భూప్రకంపనలు, భూకంపాలు వస్తుంటాయి. ఇవే కాకుండా జపాన్ ట్రెంచ్‌గా పిలుస్తున్న జపనీస్ అగాధం కూడా భూకంపాలు రావడానికి మరో కారణం. పసిఫిక్ వాయువ్య ప్రాంతంలోని ఈ సముద్ర అగాధం 800 మీటర్ల లోతులో ఉంటుంది. అందులో కదలికలు ఏర్పడినప్పుడు భూకంపాలు, సునామీలు వస్తుంటాయి. ఇదిలా ఉంటే.. భూకంపంతోపాటు, సునామీ వస్తే టోక్యో నగరంలోకి భారీగా నీరు వస్తుంది.

ఆ నీటిని మళ్లించేందుకు నగర శివారులో పెద్ద టన్నెల్స్‌ను ఏర్పాటు చేశారు. తుపానులు, వరదల కారణంగా వచ్చిన నీరు మొత్తం ఈ టన్నెళ్ల ద్వారా ఎడో నదిలోకి మళ్లిస్తారు. కాగా..ఈ ఏడాది మొదటి రోజే జపాన్‌లో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. దానిలో 200 మందిపైగా ప్రాణాలు కోల్పోయారు.



# మంగళగిరి అభివృద్ధికి అందరూ కలిసి రావాలి: మంత్రి నారా లోకేశ

అమరావతి: మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని.. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని భద్రావతి సమేత భావనా రుషి ఆలయ కల్యాణ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి నూతన వస్త్రాలు అందజేసి వేదాశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరిని దక్షిణ భారతదేశ గోల్డ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో అత్యధికంగా ఉన్న స్వర్ణకారులు, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అధునాతన ఆకృతులు, ఇతర నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు.



ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలనూ లోకేశ్ నెరవేరుస్తారని ఆయన సతీమణి బ్రాహ్మణి తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు.

# లోక్‌సభ స్పీకర్ అధికారాలపై అఖిలేష్ యాదవ్ సంచలన ఆరోపణ.. కౌంటర్ ఇచ్చిన అమిత్ షా




న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పార్లమెంట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హక్కులను కాలరాస్తున్నారని, ఆయన కోసం ప్రతిపక్షాలు పోరాడాల్సి వస్తోందని ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై చర్చ సందర్భంగా అఖిలేష్ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "మీ హక్కులు, మా హక్కులను హరించివేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి మీరే (స్పీకర్) న్యాయమూర్తి. కానీ మీ హక్కులు హరించివేస్తున్నారని నేను విన్నాను. మీ కోసం మేము పోరాడాలి" అని అన్నారు. అఖిలేశ్ యాదవ్ చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా కౌంటర్లు ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు స్పీకర్‌ను అవమానించడమేనని, స్పీకర్ హక్కులు ప్రతిపక్షానికి చెందినవి కావని ఆయన వ్యాఖ్యానించారు. స్పీకర్ హక్కులు సభ మొత్తానికి చెందుతాయని, ఈ విధంగా మాట్లాడడం సరికాదని అన్నారు. స్పీకర్ హక్కుల పరిరక్షించేది తమరు కాదని అమిత్ షా సెటైర్లు వేశారు. కాగా ఈ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా కూడా స్పందించారు. తనపైనా, సభలోని ఇతర సభ్యులు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, తాను ఇదే కోరుకుంటున్నానని అన్నారు. స్పీకర్ స్థానంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదని వ్యాఖ్యానించారు.

**సభలో వక్ఫ్ బిల్లు..** ఇండియా కూటమి పక్షాల నిరసన మధ్య కేంద్రప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును లోక్‌సభలో మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ముస్లిం సమాజం మెచ్చుకునేదిగా ఉందన్నారు. వక్ఫ్ బోర్డు చట్టంలో ఉన్న లొసుగులను సరిచేయడం కోసమే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని సరిగ్గా రూపొందించలేదన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఏ అధికరణకు వ్యతిరేకంగా లేదన్నారు. రాజకీయ కారణాలతో బిల్లు తీసుకొచ్చారని విపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కిరణ్ రిజిజు సభలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయం అందిరకీ ఒకేలా ఉండాలన్నారు. మతాలవారీ న్యాయం ఉండదన్నారు. ఈ బిల్లు ద్వారా ఎవరి హక్కులను హరించడంలేదని, ముస్లిం సమాజంలో అందరికీ హక్కులు కల్పించే ఉద్దేశంతో ఈ సవరణ బిల్లు తీసుకొస్తున్నామన్నారు. బిల్లుపై సంప్రదింపులు చేయకుండా.. ఏకపక్షంగా తీసుకొచ్చారని విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. 2014 తర్వాత వక్ఫ్ బోర్డు చట్టంపై ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించామని, ఎంతోమంది ప్రజలతో మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. అనేకమంది ముస్లిం పెద్దలు, ముస్లిం సంస్థలను కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా బిల్లు తీసుకొచ్చినట్లు కిరణ్ రిజిజు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా ప్రజల అభిప్రాయాలు స్వీకరించామన్నారు. ఎవరిని సంప్రదించకుండా బిల్లు తీసుకొచ్చామనడం సరికాదన్నారు.

# బురదలో కూరుకుపోయిన అంబులెన్స్.. నరకయాతనతో ఇంటి వద్దే కవలల్ని ప్రసవించిన మహిళ




మన్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. గిరి పల్లెల్లోని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు చేరడం కష్టంగా మారింది. ఓ గర్భిణి నరకయాతన అనుభవించి ఇంటి వద్దే కవలలకు జన్మనిచ్చారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం కించూరు పంచాయతీ గడ్డిబంధలుకు చెందిన అచ్చెమ్మ నిండు గర్భిణి. ఆమెకు పురిటినొప్పులు అధికమవ్వడంతో కుటుంబీకులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. మార్గమధ్యలో రాయగడ వంతెన వద్ద అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. దాన్ని అతికష్టం మీద బయటకు తీసి గ్రామానికి వెళ్లేసరికే గర్భిణి అచ్చెమ్మ ఓ మగ బిడ్డకు జన్మనిచ్చారు. మరో బిడ్డ కడుపులో అడ్డం తిరగడంతో నొప్పులతో యాతన అనుభవించారు. వాహనం ఇంటి వరకు చేరే మార్గం లేక కొంత దూరంలోనే ఆపేసి 108 సిబ్బంది ఇంటికి వెళ్లి ప్రసవం చేశారు. సమయానికి అంబులెన్సు సిబ్బంది వచ్చి సురక్షితంగా ప్రసవం చేయడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

## శ్రీలీల.. చీరలో నిన్ను కొట్టేవారే లేరు

క్యూట్ టాలెంటెడ్ హీరోయిన్ గా టాలీవుడ్ లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న నటి శ్రీలీల, 'పెళ్లిసంద%ఊ%' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమాతో బాక్సాఫీస్ హిట్ సాధించింది. ఈ విజయంతో ఆమె క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. కానీ తర్వాతి చిత్రాలు ఆశించిన విజయాన్ని అందించకపోవడంతో ఆమె కెరీర్ లో కొంత కన్ఫ్యూజన్ ఏర్పడింది. ఇక 2023లో శ్రీలీల నటించిన నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో 'భగవంత్ కేసరి' మాత్రమే మంచి హిట్ టాక్ సొంతం చేసుకుంది. మిగతా మూడు సినిమాలు అనుకున్న స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయాయి. తాజాగా సంక్రాంతికి వచ్చిన 'గుంటూరు కారం' కూడా మిక్స్డ్ టాక్ తో సరిపెట్టుకుంది. ఈ సమయానికి శ్రీలీల కోసం వచ్చిన కొన్ని అవకాశాలు కూడా చేజారిపోవడం కొంత నిరాశ కలిగించింది. ఇక శ్రీలీల కొంత సైలెంట్ గా ఉంటూ, కెరీర్ పరంగా ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటోంది. ఆమె కొత్త కథలను జాగ్రత్తగా ఎంపిక చేయాలని నిర్ణయించుకుంది. సోషల్ మీడియాలో కూడా గ్లామర్ లుక్స్ తో మళ్లీ స్పీడ్ పెంచుతోంది.



రీసెంట్ గా ఆమె పోస్ట్ చేసిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఆరెంజ్ కలర్ చీరలో అమ్మడు ఇచ్చిన స్టిల్స్ వావ్ అనేలా ఉన్నాయి. ఇక ఆ అందానికి తన నవ్వును జత చేస్తూ మరో లెవెల్లో ఎట్రాక్ట్ చేసింది. ఈ ఫొటోలలో శ్రీలీల చాలా అందంగా ఉందంటూ చీర కడితే ఆమెను ఎవరు డామినేట్ చేయలేరని కితాబిస్తున్నారు. ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే.. శ్రీలీలకు ఒక భారీ ఛాన్స్ వచ్చినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ సరసన నటించే అవకాశం వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో అజిత్ హీరోగా తెరకెక్కుతున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా ఎంపికైనట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 'మార్క్ ఆంటోనీ' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మేకర్స్ ఆమెను సంప్రదించగా, కథ నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్ట్ తో శ్రీలీల కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోతుందని వారు భావిస్తున్నారు. తెలుగు సినీ పరిశ్రమలో ఆమెకు వచ్చిన ఫ్లాపులు ఈ కోలీవుడ్ బిగ్ బ్రేక్ తో మరచిపోవచ్చని ఆశపడుతున్నారు. శ్రీలీల ఈ భారీ తమిళ ప్రాజెక్ట్ లో ఎలాంటి ఫలితం సాధిస్తుందో చూడాలి.

## కీర్తి గ్లామర్ ట్రీట్.. ఈసారి మరింత మెరిసేలా..

టాలీవుడ్ లో 'మహానటి' చిత్రంలో సావిత్రి పాత్రను అద్భుతంగా పోషించి నేషనల్ అవార్డును అందుకున్న మలయాళీ నటి కీర్తి సురేష్, తన కెరీర్ ప్రారంభంలోనే తెలుగులో కొన్ని సక్సెస్ లు సాధించి, స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందింది. 'నేను శైలజ' సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన కీర్తి, తరువాత 'నేను లోకల్' సినిమాతో మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత 'మహానటి' బయోపిక్ లో సావిత్రి పాత్రను నటించడం అనేది ఆమె కెరీర్ లో పెద్ద మైలు రాయిగా నిలిచిపోయింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవడం తో పాటు, కీర్తిని స్టార్ హీరోయిన్ గా మార్చేసింది. ఆ తర్వాత కీర్తి సురేష్ ఫీమేల్ సెంట్రిక్ కథలతో సినిమాలు చేస్తూ, కొంతకాలం వృత్తిపరంగా ముందడుగు వేసింది. కానీ ఆ సినిమాలు పెద్దగా సక్సెస్ కాలేదు. కీర్తి మళ్ళీ కమర్షియల్ సినిమాల వైపు మొగ్గు చూపింది. ఇక కల్కి లాంటి సినిమాల్లోనూ ఆమె ఏదో ఒక విధంగా భాగం అవుతోంది.



ఇక ఆమె సోషల్ మీడియాలో కూడా గ్లామర్ తో మరింత ఫ్యాన్ ఫాలోవర్స్‌ను పెంచుకుంటోంది. కీర్తి సురేష్ ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కుర్రాళ్ళు ఫిదా అవుతుంటారు. ఇక ఆమె చీర కడితే రెండు కళ్ళు సరిపోవు. రీసెంట్ గా అమ్మడు మరోసారి అందమైన చీరలో కనిపించిన విధానం ఎంతగానో ఆకట్టుకుంది. అమ్మడు తన నవ్వుతోనే ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తోంది. ఇక మహేష్ బాబు తో 'సర్కారు వారి పాట' మరియు నాని తో 'దసరా' లాంటి సినిమాలలో నటించి మళ్లీ కమర్షియల్ హిట్స్ అందుకుంది. ఇటీవల కీర్తి మెగాస్టార్ చిరంజీవి సరసన 'భోళా శంకర్' చిత్రంలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇప్పటివరకు తెలుగులో కొత్త ప్రాజెక్టులు ఒకే చేయని కీర్తి సురేష్, ప్రస్తుతం తమిళ్, మలయాళం, హిందీ భాషలలో నాలుగు సినిమాలు కమిట్ అయి వాటిపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. కీర్తి హిందీలో కూడా సక్సెస్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. ఇంతకుముందు అజయ్ దేవగన్ తో 'మైదాన్' సినిమాలో నటించాల్సిన కీర్తి, ఏజ్ ఫ్యాక్టర్ సెట్ కాలేదని ఆ పాత్రకు ప్రియమణి తీసుకున్నారు. హిందీ చిత్రసీమలో సక్సెస్ కోసం 'బేబీ జాన్' అనే చిత్రంలో హీరో వరుణ్ ధావన్ సరసన కీర్తి ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రం హిట్టవుతుందని ఆశిస్తూ, బాలీవుడ్ లో మరిన్ని అవకాశాలు వస్తాయని భావిస్తోంది. ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టుల కోసం కీర్తి సురేష్ తన పెళ్లి కూడా వాయిదా వేసుకున్నట్లు ఈ మధ్య టాక్ వినిపించింది. ఇంట్లో తల్లిదండ్రుల బలవంతం ఉన్నా, కీర్తి ప్రస్తుతం తన దృష్టిని పూర్తిగా సినిమాలపైనే కేంద్రీకరించింది. హిందీ చిత్రసీమలో అవకాశాలు కోసం శ్రద్ధ పెడుతున్న కీర్తి, తెలుగు సినిమాలకు కొంత దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. అయినా కూడా ఆమె డబ్బింగ్ చిత్రాల ద్వారా ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది.





## ట్రెండీ స్టోరి: 'కన్నప్ప'లో బాహుబలి పోలికలు



మంచు కుటుంబ హీరోల నుంచి చాలా రోజుల తర్వాత ఒక సినిమా వస్తోంది. అది కూడా పాన్ ఇండియా టార్గెట్ తో అత్యంత భారీ వ్యయంతో రూపొందిస్తున్న సినిమా కావడంతో ఆసక్తి నెలకొంది. ఇందులో పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్, మాలీవుడ్ కంప్లీట్ స్టార్ మోహన్ లాల్ వంటి వారు కీలక పాత్రల్లో నటించడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇటీవలే టీజర్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ టీజర్ విజువల్ ట్రీట్ అంటూ ప్రశంసలు దక్కినా కానీ, ఒక సెక్షన్ నుంచి ఇది బాహుబలి పాత్రల స్ఫూర్తితో రూపొందించినది! అంటూ విమర్శలు రావడం దానిపై సోషల్ మీడియాలో డిబేట్లకు తెర లేవడం విశేషం. వాయులింగాన్ని దొంగిలించడానికి దుండుగులు చేసే ప్రయత్నాన్ని కన్నప్ప టీజర్ లో ఆవిష్కరించారు. అయితే ఈ దొంగతనాన్ని ఆపిని ఒకే ఒక వ్యక్తి- కన్నప్ప. శివయ్య విగ్రహాన్ని దొంగతనం నుండి రక్షిస్తాడు. అతడు ఎవరి సహాయం లేకుండా ఎంతటి బలమైన వ్యక్తులనైనా చంపగలడని టీజర్ లో చూపించారు. టీజర్‌లో కన్నప్ప తన కర్తవ్యం కోసం పోరాడే సన్నివేశాలు రక్తి కట్టించాయి. కొన్ని సెకన్ల టీజర్ లో ఇందులో నటించిన స్టార్లందరినీ ఛమక్కులాగా చూపించారు. మోహన్ బాబు, శరత్‌కుమార్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్‌లను దేగకళ్లతో చూసిన అభిమానులు గుర్తించారు. గమ్మత్తుగా వీరందరినీ రెప్ప పాటులో మాత్రమే గుర్తించేలా టీజర్ ని కట్ చేసిన తీరు ఆకట్టుకుంది. టీజర్ ఆద్యంతం కన్నప్ప పాత్రధారి మంచు విష్ణు వీరోచిత పోరాటాలు రక్తి కట్టించాయి. అడవులు పచ్చదనం ఆకట్టుకుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఈ చిత్రం విడుదల కానుంది. ఆసక్తికరంగా ఈ యాక్షన్ సినిమా టీజర్‌లో "1:24 ప్రభాస్??, 1:06 కాజల్, 0:59 మోహన్ లాల్, 1:13 అక్షయ్ కుమార్" అని రాస్తూ ఒక అభిమాని టీజర్ లో ఎవరెవరిని గుర్తించాడో టైమ్‌లైన్‌లను షేర్ చేశాడు. అంతేకాదు.. ఇందులో విలన్ కి సహాయక పాత్రధారిగా ఉన్న ఒక ఒంటికన్ను వికృత రూపధారిని చూపిస్తూ ఇతడు బాహుబలి లోని కాళకేయను తలపించాడని, అతడి గ్యాంగ్ కాళకేయ గ్యాంగ్ లా ఉందని ఒక నెటిజనుడు కామెంట్ చేసారు. అలాగే ఇందులో కథానాయికగా కనిపిస్తున్న ప్రీతి ముకుందన్ లుక్ ను ఆ పాత్రను బాహుబలి అవంతిక పాత్రతో పోల్చడం గుర్తించాలి. అయితే కన్నప్పగా నటించిన విష్ణు పాత్రను బాహుబలిలోని శివుడి పాత్రతో పోల్చకపోవడం గమనించదగినది. ఇక్కడ గమనించాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయి. బాహుబలిలో శివుడు పాత్రధారి (ప్రభాస్) అతడి గిరిజనుల వంశానికి చెందిన పోలికలు కన్నప్పకు అతడు నివశించే సమాజానికి ఉన్నాయి. కన్నప్ప కూడా ఒక గిరిజనుడు. అందువల్ల అతడి దళంలోని వారంతా, లేదా ప్రత్యర్థి దళంలోని వారంతా ఇంచుమించి కాళకేయ దళంలా కనిపిస్తున్నారు. అందువల్ల పోలిక చూడటం సహజం. అవంతిక తమన్నా లాగా ఇంచుమించు అవే నార దుస్తులు తరహాలో ధరించింది కాబట్టి కన్నప్ప హీరోయిన్ ని వెంటనే పోలికలు చెప్పేశారు నెటిజనులు. కేన్స్‌లో కన్నప్ప టీజర్ ప్రదర్శన విష్ణు, మోహన్ బాబు, విరానికా మంచు, ప్రభుదేవా గత నెలలో ఈ చిత్రం టీజర్‌ను ప్రదర్శించడానికి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి వెళ్లారు. స్క్రీనింగ్ తర్వాత విష్ణు X లో ఇలా రాసాడు. కన్నప్ప టీజర్‌ను ఇక్కడ కేన్స్‌లో ప్రదర్శించామని, సానుకూల స్పందన వచ్చిందని తెలిపారు! అంతర్జాతీయ డిస్ట్రిబ్యూటర్‌లు, స్థానిక భారతీయులు చూసిన ప్రతి ఒక్కరూ దీన్ని పూర్తిగా ఇష్టపడ్డారు. ఈ స్పందనలను చూసిన తర్వాత నేను సంతోషిస్తున్నాను అని అన్నారు. కన్నప్ప గురించి... కన్నప్ప పరమశివుని భక్తుడు. శివుడి కోసం తన కనుగుడ్లను పెకిలించి ఇచ్చిన సాహసి. టైటిల్ పాత్రలో మంచు విష్ణు నటించారు. ఈ చిత్రానికి డా.ఎం.మోహన్ బాబు నిర్మాత. పరుచూరి గోపాల కృష్ణ, ఈశ్వర్ రెడ్డి, జి నాగేశ్వర రెడ్డి, తోట ప్రసాద్ కథ అందించగా, కన్నప్ప చిత్రానికి విష్ణు స్క్రీన్ ప్లే రాశారు. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

## అఫీషియల్: పుష్ప 2 న్యూ డేట్.. ఇది అసలు మ్యాటర్!




అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప: 2 ది రూల్' కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్ కలయికలో వస్తున్న ఈ పాన్-ఇండియన్ యాక్షన్ ఎంటర్టైనర్ రిలీజ్ డేట్ విషయంలో అనేక రకాల గాసిప్స్ వైరల్ అయిన విషయం తెలిసిందే. రూమర్స్ ఎన్ని వచ్చినా కూడా మేకర్స్ నిన్నటి వరకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఆ కాంపౌండ్ లో ఉండేవారు అప్పుడప్పుడు హింట్ ఇచ్చినప్పటికీ బన్నీ ఫ్యాన్స్ అయితే పెద్దగా నమ్మలేదు. ఇక ఫైనల్ గా మేకర్స్ కొద్దిసేపటి క్రితమే ఒక క్లారిటీ ఇచ్చారు అఫీషియల్ గా ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేస్తూ న్యూ రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇచ్చారు. ఆ పోస్టర్ లో పుష్పరాజ్ కత్తి పట్టుకొని పవర్ఫుల్ గా కనిపిస్తున్నారు. ఇక ఆగస్టు 15న రావాల్సిన పుష్ప 2 ఇప్పుడు డిసెంబర్ 6న విడుదల కానుందని అధికారికంగా తెలియజేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ ఇప్పటివరకు అద్భుతంగా కొనసాగాయి. సినిమా టీజర్, టైటిల్ ట్రాక్, మరియు కపుల్ సాంగ్ ప్రేక్షకుల హృదయాలను దోచేశాయి. అందరూ అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా, ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుందట. మల్టీ లాంగ్వేజ్ లో విడుదల అవుతున్నట్లు చెబుతూ సినిమా ఆలస్యంగా వస్తున్న విషయంలో ఒక క్లారిటీ ఇచ్చారు. లేట్ అయినా బెస్ట్ అవుట్ పుట్ అందించడానికి కట్టుబడి ఉన్నాం అని చిత్ర బృందం తెలిపింది. మిగతా షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం కొంత సమయం అవసరమని, అందుకే విడుదల తేదీ మార్చాల్సి వచ్చిందని వివరించారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతూ.. దర్శకుడు సుకుమార్ స్టైల్ కు తగ్గట్లే, భారీ అంచనాలను మించి సినిమాను డిజైన్ చేస్తున్నట్లు తెలిపారు. మైత్రి మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ ఈ చిత్రాన్ని అత్యంత ఖరీదుగా నిర్మిస్తున్నారని.. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్ మిరెస్లో కుబా బ్రోజెక్ తమ కెరీర్ లోనే అత్యుత్తమ పనితీరును ప్రదర్శించనున్నారని కూడా తెలియజేశారు. ఇక రష్మిక మందన్న ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తుండగా, ఫహద్ ఫాజిల్ ప్రధాన ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. 'పుష్ప: ది రైజ్' ప్రేక్షకుల నుండి భారీ ఆదరణ పొందిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సృష్టించిన రికార్డులు, అల్లు అర్జున్ నటన, సుకుమార్ మేకింగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో ఈ సీక్వెల్ పై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టు ఉంటుందని చిత్రబృందం ధీమాగా ఉంది. మరి న్యూ రిలీజ్ డేట్ ఆడియెన్స్ లో ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

## ఎల్లో పీస్ లో నేషనల్ క్రష్ కాక పుట్టించేలా?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న టెంప్టింగ్ ఎలివేషన్ల గురించి ప్రత్యేకించాల్సిన పనిలేదు. అమ్మడు ఎక్కడుంటే? అక్కడ కుర్రాళ్లకు పండగే అన్నట్లు! అందులోనూ బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత రష్మిక లో ఎలివేషన్ల పరంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. తొలి సినిమా వాతావరణం చూసి అమ్మడు మడి కట్టుకుని కూర్చునే టైప్ అనుకున్నారంతా. కానీ కాలక్రమంలో తనలో ఛేంజోవర్ చూసి షాక్ అవ్వాల్సిన పరిస్థితి నుంచి రష్మిక రియాల్టీ అంటే ఇలాగే ఉంటుందని ఎన్నోసార్లు ప్రూవ్ చేసింది. ఉత్తరాదికెళ్లాక పూర్తిగా గ్లామర్ గేట్లు ఎత్తేసి బాలీవుడ్ భామలకే సవాల్ విసురుతుంది. నటనతో సహా హాట్ హాట్ ఫోటోలు వదలడంలో నాకు సాటెవ్వరు? అంటోంది. తాజాగా




అమ్మడు మరోసారి హాట్ ఫోటోలతో ఇన్ స్టాలో చెలరేగింది. ఇదిగో ఇక్కడిలా రష్మిక మార్క్ ఔట్ ఫిట్ లో కెమెరాకి ఫోజులిచ్చింది. ఇందులో అమ్మడు స్కిన్ షో పీక్స్ లో చేసింది. ఎల్లో కలర్ పీసుల్లో పెద్ద దుమారమే రేపింది. హొయలుపోతూ అమ్మడు కెమారికి ఇచ్చిన భంగిమలకి కుర్రాళ్లంతా షాక్ తింటున్నారు. మరో పిక్ లో ఫ్లోరల్ దుస్తుల్లోనూ అంతే అందంగా హైలైట్ అవుతుంది. అలాగే సైక్లింగ్ చేస్తూ మరో పిక్ ని వదిలింది. వీటన్నింటిని మొత్తంగా ఓ వీడియో రూపంలో నెటి జనుల ముందుకు తీసుకొచ్చింది.

ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. రష్మి క అభిమానులు అమ్మడి అందాన్ని తనివి తీరా ఆస్వాదిస్తున్నారు. ఇక రష్మిక కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగు, హిందీ రెండు భాషల్ని దున్నేస్తుంది. ఈ మధ్యనే లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకు కూడా సంతకాలు చేయడం మొదలు పెట్టింది. తొలి ప్రయత్నం సక్సెస్ అయితే రష్మిక ఫాలోయింగ్ తో మరిన్ని అవకాశాలు చేజిక్కించుకుంటుంది. తెలుగులో పుష్ప-2 లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.

## మినీ స్కర్ట్ లో అంజలి.. క్యూట్ గానే హీటెక్కిస్తోందిగా

టాలీవుడ్ హీరోయిన్ అంజలికి మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. తన అందం, అభినయంతో సౌత్ సినీ ఇండస్ట్రీలో స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. ఒక్కో సినిమాకు తనలోనే టాలెంట్ ను బయట పెడుతూ తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగింది ఈ రాజోలు బ్యూటీ. క్యారెక్టర్ ఏదైనా.. తన నేచురల్ యాక్టింగ్ తో సినీ ప్రియులను ఓ రేంజ్ లో అలరిస్తోంది. రిజల్ట్ తో సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తోంది. హీరోయిన్ పాత్రలే కాదు.. కంటెంట్ ముఖ్యమంటూ సైడ్ రోల్స్ కూడా చేస్తోంది. ఇటీవల మాస్ కా దాస్ విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో యాక్ట్ చేసి.. తన నటనతో మంచి పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం పలు సినిమాలతో పాటు వెబ్ సిరీసుల్లో కూడా నటిస్తోంది అంజలి. ఇక నిన్న(జూన్ 16) బర్త్ డే జరుపుకుంది. ఈ సందర్భంగా ఆమెకు అనేక మంది సినీ సెలబ్రిటీల తో పాటు అభిమానులు... సోషల్



మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే రీసెంట్ గా తన బర్త్ డే పిక్స్ షేర్ చేసింది అంజలి. 'సూర్యుని చుట్టూ మరో ప్రయాణం పూర్తయింది! అంతులేని ప్రేమ, మద్దతు ఇచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. లైఫ్ లో కొత్త సంవత్సరాన్ని మరువలేనిదిగా చేద్దాం' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం బ్యూటీ వెకేషన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. కేక్ కటింగ్ పిక్స్ ను షేర్ చేసింది. తన బెడ్ పై %ఝుజూజూఎ దీఅతీస్త్రఝుఎ% అని రాసి ఉన్న పిక్ స్పెషల్ గా ఉంది. తన పెట్ తో దిగిన సెల్ఫీ పంచుకుంది. ఇక అంజలి పోస్ట్ చేసిన పిక్స్ లో ఓ ఫోటో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. నైట్ పార్టీకి వెళ్లిన అంజలి.. బేబీ పింక్ కలర్ పొట్టి స్కర్ట్ లో మెరిసింది. ఆ సమయంలో క్యూట్ హ్యాండ్ బ్యాగ్ వేసుకుని పోజు ఇచ్చింది. స్కిన్ అండ్ థైస్ షోతో ఫిదా చేసింది. సూపర్ బర్త్ డే గర్ల్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సింపుల్ గా కనిపిస్తూనే హీట్ పుట్టిస్తోందని చెబుతున్నారు. ఆల్ ది బెస్ట్ ఫర్ యువర్ న్యూ ఇయర్ అని రచ్చ రచ్చ చేస్తున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం అంజలి.. స్టార్ హీరో రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ మూవీలో నటిస్తోంది. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో తాను కూడా ఒక హీరోయిన్ అని ఇటీవల తెలిపింది. దాంతోపాటు బహిష్కరణ అనే వెబ్ సిరీస్ లో యాక్ట్ చేస్తోంది. ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ ను రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేయగా.. అందులో రౌద్రంగా కనిపించింది. మరి వరుస ప్రాజెక్టులతో అంజలి ఎలాంటి హిట్లు అందుకుంటుందో చూడాలి.




# భారత్‌లోనే తొలిసారి..

## సాధించిన రేవంత్ రెడ్డి.. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌కు..!

హైదరాబాద్, ఆగస్టు 8: తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సాగుతోంది. ఇప్పటికే పలు కంపెనీల ప్రతినిధులతో రేవంత్ బృందం భేటీ అయ్యింది. తాజాగా ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటిం చింది.

భారత్ లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భం గా టెక్నాలజీ అండ్ డెవెలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయా న్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభు త్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గ దర్శనం చేస్తామని చెప్పారు.

తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్ కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.



# నిజాం కాలేజీ విద్యార్థినుల ఆందోళన.. రంగంలోకి బల్మూరి వెంకట్

హైదరాబాద్: నిజాం కాలేజీలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హాస్టల్ డిగ్రీ విద్యార్థినులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. గురువారం కూడా వారు తరగతులకు హాజరవ్వకుండా ఆందోళన చేపట్టారు. ఈ నిరసన ఆరో రోజుకి చేరుకుంది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిజాం కాలేజీ వీసీకి ఆదేశాలిచ్చినా విద్యార్థినులతో నామమాత్రంగానే చర్చలు జరిగాయి. అయితే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రంగంలోకి దిగి విద్యార్థులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వారు చేస్తున్న ధర్నా వద్దకి వెంకట్ చేరుకుని విద్యార్థినులతో చర్చించారు. తొలుత సమస్యలపై కళాశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని %ఖ+% విద్యార్థులకు ఆయన ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు. అయితే, మరో వైపు PG విద్యార్థులు ఆందోళనకు దిగారు. %ఖ+% వాళ్లకి హాస్టల్ కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని వారు కూడా నిరసనకు దిగారు.

**మరో భవనం నిర్మించాలి..** తమకు న్యాయం చేయాలని పీజీ విద్యార్థినులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గర్ల్స్ హాస్టల్ డిగ్రీ వాళ్లకే కేటాయిస్తే, తాము ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రావాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌లో బస్సుల్లో సమయానికి కాలేజీకి చేరుకోలేకపోతున్నామని పీజీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ ఆవరణంలో మరో భవనం నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని సీనియర్లు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తానని పీజీ విద్యార్థినులకు బల్మూరి వెంకట్ హామీ ఇచ్చారు.

**సబితా ఇంద్రారెడ్డిని కలిసి..** మరోవైపు.. కేసీఆర్ ప్రభుత్వం నిజాం కాలేజ్ విద్యార్థినుల కోసం, యూజీ, పీజీ విద్యార్థినుల కోసం వేర్వేరుగా హాస్టల్ భవనాలు కట్టించింది. అయితే ప్రస్తుతం ఉన్న యూజీ హాస్టల్ భవనంలో పీజీ వారికి 50 శాతం, యూజీ వారికి 50 శాతం కేటాయించారు. ఇలా చేయడాన్ని నిరసిస్తూ యూజీ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. తమ సమస్యపై విద్యార్థినులు మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి గత ఆదేశాలకు అనుగుణంగా 100 శాతం యూజీ విద్యార్థినులకే హాస్టల్ భవనాన్ని కేటాయించేలా చూడాలని కోరారు. వారి ధర్నా పట్ల సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కేటాయింపుల మాదిరిగానే 100 శాతం యూజీ విద్యార్థినులకు కేటాయించి వారికి న్యాయం చేయాల్సిందిగా నిజాం కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా నాయక్‌కు సబితా సూచించారు.

**భవిష్యత్తు కార్యాచరణపై..** అయితే, యూజీ విద్యార్థినులు ఆందోళనలో భాగంగా ఇవాళ వంటావార్పు చేపట్టారు. వసతి గృహాన్ని తమకే కేటాయించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తు కార్యాచరణ చేపట్టేందుకు సన్నద్ధమవుతామని వారు హెచ్చరించారు. యూజీ, పీజీ విద్యార్థినులకు సమానంగా హాస్టళ్లు కేటాయిస్తామని అధికారులు వెల్లడించగా, దీనికి యూజీ విద్యార్థినులు అంగీకరించలేదు. యూజీ విద్యార్థినుల కోసం నిర్మించిన హాస్టల్‌లో గదులన్నీ తమకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం తాము పోరాడుతున్నామని.. ప్రభుత్వం తమ సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణకు పెట్టుబడులు నిజమే

హైదరాబాద్, ఆగస్టు 8: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు.

తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు.

**హైదరాబాద్‌కు చార్లెస్ స్క్వాబ్...** ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.



హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

# సీఎం రేవంత్ అమెరికా పర్యటనపై బీఆర్ఎస్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన సంపత్



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనపై బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తిప్పి కొట్టారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... "బాల్క సుమన్, క్రిశాంక్‌లు కేటీఆర్‌కు విరుద్ధంగా మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు సుమన్, క్రిశాంక్ మధ్య చెడినట్లుంది" అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని కేటీఆర్ కోరుకున్నారని తెలిపారు. ఓడిపోయిన నైరాశ్యంలో బీఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని మండిపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడుల కోసమే సీఎం, మంత్రులు అమెరికా వెళ్లారన్నారు. ఓర్వలేక సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన కుటుంబంపై కొందరు విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్లో రేవంత్ రెడ్డి రివ్యూ మీటింగ్ జరిగేటప్పుడు కాంగ్రెస్ ఇంచార్జ్‌గా తిరుపతి రెడ్డి అధ్యక్షత వహించారని తెలిపారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా టూర్ అధికారిక పర్యటన కాదని స్పష్టం చేశారు. ఇంకో సోదరుడుకి అమెరికాలో స్వచ్ బయో కంపెనీ ఉందని... దానిద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెడితే తప్పేంటి? దాని మీద ఎందుకు రాజకీయం చేస్తున్నారు అని నిలదీశారు. పది సంవత్సరాలలో కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణలో విస్తరించారన్నారు. రేవంత్ రెడ్డి ఎనిమిది నెలలలో కుటుంబాన్ని ఎక్కడ చూపించలేదని తెలిపారు. "శ్రీరాముడి కల్యాణానికి భద్రాచలం ఆయన మనుమడు తలంబ్రాలు తీసుకెళ్లిండు. కుటుంబ పాలన అంటే కేసీఆర్‌ది. రేవంత్ రెడ్డిది కాదు. కావాలనే బట్ట కాల్చి మీద ఏస్తున్నారు. ప్రాంతం వారు మోసం చేస్తే అక్కడే బొంద పెట్టాలి, ప్రాంతీయేతరులు మోసం చేస్తే బయట బొంద పెట్టాలని కాళోజీ నారాయణ రావు చెప్పారు. అందుకే పది ఏండ్లు తెలంగాణను మోసం చేసిన కేసీఆర్‌ను ప్రజలు బొంద పెట్టారు. మరొకసారి బద్నాం చేయాలని చూస్తే మెమేంటో చూపిస్తాం" అంటూ సంపత్ కుమార్ హెచ్చరించారు.

**బాల్కసుమన్ ఏమన్నారంటే..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హెూదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్‌లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హెూదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని... ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. ఇవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధాన కంపెనిలే కాకుండా రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు.

# గత సర్కారు నిర్వాకంతోనే.. పంచాయతీలకు ఇక్కట్లు

## - మీ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు - హరీశ్ మర్చిపోయారా?: మంత్రి సీతక్క

హైదరాబాద్: గత ప్రభుత్వ నిర్వాకంవల్లే గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే హక్కు వారికి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు.


స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా రాజకీయాలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. 'పదే పదే అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరు. మీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా?' అని నిలదీశారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఖండించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.10,170 కోట్లు కేటాయించి రూ.5,988కోట్లే విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 44శాతం నిధులివ్వకుండా గత ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. నేషనల్ రూర్బన్ (రూరల్ అర్బన్)



మిషన్‌కు 2019 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రూ.1,200 కోట్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. స్వచ్ఛ భారత్‌మిషన్ కింద చేయించిన పనులకు సంబంధించి ఆరేళ్లుగా రూ.940 కోట్లు, రూరల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.600కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు.

# నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్ల ద్వారా నీటి విడుదల

నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతున్నది. దీంతో 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడిచిపెడుతున్నారు. సాగర్‌లోకి 2.53 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. 2.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుకాగా ప్రస్తుతం 585.30 అడుగులుగా ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 312.50 టీఎంసీలు కాగా, ఇప్పుడు 298.30 టీఎంసీలుగా నమోదయింది. సాగర్ నుంచి భారీగా వరద వస్తుండటంతో దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు పూర్తిగా నిండింది. జలాశయంలోకి 2.57 లక్షల క్యూసెక్కుల



వరద వస్తుండగా, 11 గేట్ల ద్వారా 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 167.9 అడుగుల వద్ద ఉన్నది. 45.77 టీఎంసీలకుగాను 35.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# స్థానికతపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి..

## హరీశ్‌రావుకు జీవో 33 బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల తమ పిల్లలు వైద్య విద్య చదివే అవకాశాలు కోల్పోతున్నట్లు హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన పేరెంట్స్ ఆందోళన వ్యక్తంచేశారు. నాలుగేండ్ల నిబంధన వల్ల తెలంగాణలో పుట్టిన పిల్లలు తెలంగాణలో స్థానికేతరులు కావడం బాధగా ఉందని పోయారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల స్వరాష్ట్రంలో తెలంగాణ బిడ్డలు ఎంబీబీఎస్, బీడీఎస్ చదివే అవకాశం కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం చేసే 33 జీవోపై పోరాటం చేస్తామని హరీశ్‌రావు వారికి హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా న్యాయ పోరాటానికి సైతం వెనకాడబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని, ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం



ఇప్పటికైనా స్పందించి తెలంగాణ పిల్లలకు అడ్మిషన్ల కోసం స్థానికతను నిర్ధారించడానికి కొత్త విధానం రూపొందించాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో ఒక హై లెవెల్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థులకు అడ్మిషన్స్ విషయంలో అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

# కాపర్ వైర్, ఆయిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

నల్లగొండ : కొంతకాలంగా నల్లగొండ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లను డ్యామేజ్ చేసి అందులోని కాపర్ వైర్, ఆయిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు.

1గురువారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలోని చందంపేట మండలం యల్మలమంద గ్రామానికి చెందిన మెగావత్ రంగా నాయక్, జటావత్ ఇమామ్ నాయక్, జటావత్ మౌలాన నాయక్, షేక్ జటావత్ వలీ నాయక్, కేతావత్ సునిల్ ఐదుగురు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డ్యామేజ్ చేసి అందులోని కాపర్ వైర్, ఆయిల్ చోరీ చేసి ఎవరికి అనుమానం రాకుండా కారులో హైదరాబాద్‌కు తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకునే వారని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి



వద్ద ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని నిందితుల వద్ద నుంచి రూ.9 లక్షల నగదు, ఓ కారు, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# కూరగాయల ధరల పెరుగుదలపై విపక్షాల ఆందోళన.. ఉల్లిపాయల దండతో ఎంపీల నిరసన



దేశంలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అరకొర సంపాదనతో బతుకు బండి లాగుతున్న సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇక ప్రతి వంటలోనూ తప్పనిసరిగా ఉపయోగించే ఉల్లిపాయలు ప్రస్తుతం సామాన్యుల కళ్లలో నీళ్లు తెప్పిస్తున్నాయి. గత నాలుగైదు నెలల నుంచి ఉల్లి ధరలు పైపైకే వెళ్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ ఉల్లిపాయల ధర రూ.50కి పైనే పలుకుతోంది. కొన్ని చోట్ల రూ.60కి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉల్లి, ఇతర కూరగాయల ధరల పెరుగుదలపై విపక్ష ఇండియా కూటమి పార్టీల ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా వివిధ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు గురువారం ఉదయం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఉల్లిపాయలతో చేసిన దండలను మెడలో వేసుకుని ధరలు తగ్గించాలంటూ మకర ద్వారం వద్ద నినాదాలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com